
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



20

జగిత్యాల

మంగళవారం | 29-8-2017



ఊంజల్ సేవ సందర్భంగా కోరుట్లలో ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

విఘ్నేశ్వరుడికి
ఊంజల్ సేవ...

20

లక్ష్యం చేరలేదు..

- పక్కదారి పడుతున్న కస్టమ్స్ మిల్లింగ్ బియ్యం
- జిల్లాలో 75,545 మెట్రిక్ టన్నుల టార్గెట్
- గడువు ముగుస్తున్నా 63 శాతం మేరకే అందజేత
- డీఎస్‌వో లేక పర్యవేక్షణ కరువు

◆ ఆంధ్రజ్యోతి, జగిత్యాల 9

కస్టమ్స్ మిల్లింగ్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కొందరు రైస్‌మిల్లుల యజమానులు సీఎంఆర్ పేరుతో వరిధాన్యం తీసుకుని బహిరంగ మార్కెట్‌లో బియ్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టు చివరి వరకు మొత్తం బియ్యం అందించాల్సి ఉండగా 63 శాతం మాత్రమే ప్రభుత్వానికి అప్పగించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో పర్యవేక్షణ లేక రైస్‌మిల్లర్లు బియ్యం ప్రభుత్వానికి అందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.





కేజీబీవీ ఉద్యోగుల నిరసన

- పదో పీఆర్‌సీ అమలు చేయాలి
- ప్రసూతి సెలవులు, హెల్త్‌కార్డులు అందించాలని ఆందోళన

- జగిత్యాల టౌన్ 9



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేజీబీవీ ఉద్యోగులు



జగిత్యాలలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

గురుకుల పాఠశాలల్లో
భోజనాలపై నిఘా

- ఒక్కో పాఠశాలలో ముగ్గురు విద్యార్థులతో మెస్ కమిటీలు
- జగిత్యాలలో మైనార్టీ గురుకుల పాఠశాల వార్డెన్‌కు షోకాజ్
- డీఎండబ్ల్యూవో, సూపరింటెండెంట్ నెంబర్లను డిస్‌ప్లే చేయాలంటూ ఆదేశాలు

9

◆ ఆంధ్రజ్యోతి, జగిత్యాల



రాయపట్నం వద్ద గోదావరి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీష్‌రావు

బీడు భూములు సాగులోకి..

- రైతుల కష్టాలు తీర్చడం కోసమే ఎస్సారెస్పీకి రివర్స్ పంపింగ్
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు
- తిమ్మాపూర్, రాయపట్నంలో ఎత్తిపోతల పథకాలు ప్రారంభం

- ధర్మపురి 8

సెలవుల అనంతరం

పోస్టింగ్ నిబంధనలు...

జగిత్యాల టౌన్ : ప్రభుత్వ ఉద్యోగులు వివిధ కారణాలతో సెలవులో వెళ్లి ముగిసిన తర్వాత ప్రధాన కార్యాలయంలో పోస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకుని కొంతకాలం వేచి ఉంటే దాన్ని 'తప్పని నిరీక్షణ' అంటారు. ప్రాథమిక నిబంధన (ఎఫ్.ఆర్) 9(13) ప్రకారం ఉద్యోగి సెలవు అనం తరం పోస్టింగ్ కోసం నిరీక్షించిన కాలాన్ని డ్యూటీగా పరిగణించి జీతభ త్యాలు ఇవ్వాలి. 'తప్పని నిరీక్షణ' కాలాన్ని డ్యూటీగా ప్రభుత్వం పరిగ ణించడం వలన ప్రభుత్వ ఖజానాపై అధిక భారం పడుతుందని సత్వరమే ఫైళ్లను పరిష్కరించాలని అన్ని శాఖల అధీకృత అధికా రులందరికీ నిర్ధిష్టమైన సూచనలు జారీ చేసింది. ఉద్యోగి డ్యూటీలో ఉన్నపుడు ఏ జీత భత్యాలకు అర్హుడో సెలవుల అనంతరం పోస్టింగ్‌లో చేరితే అంతే జీతభత్యాలు ఇవ్వాలి. ప్రతిస్థాయిలో మూడు రోజుల కంటే ఎక్కువ ఫైల్ ఉంచుకున్న వారు బాధ్యులు అవుతారు. 30రోజుల కంటే ఎక్కువ కంపల్సరీ వేట్‌గా పరిగణించాల్సి వస్తే నాన్ గెజిటెడ్ ఉద్యోగులకైతే శాఖాధిపతి మూడు రోజల కంటే ఎక్కువ కాలం ఫైల్‌ను ఉం చుకున్న వారందరినీ గుర్తించి వారికి వారి బాధ్యత ఆధారంగా కంపల్సరీ వేట్‌కు అయ్యే మొత్తమును ఆఅధికారి నుంచి రాబట్టేందుకు ఉత్తర్వులు ఇవ్వాలి. ఆతర్వాతే ఆర్థికశాఖకు నిర్ణీత ఫారంలో ప్రతిపాదనలు పంపాలి. కంపల్సరీ వేట్ గురించి తొలుత జీవో నెం.48, ఆర్థికశాఖ తేదీ 24-03-1981న జారీ చేసింది. 30రోజుల లోపల ప్రభుత్వానికి ప్రతిపా దనలు పంపాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ ఉద్యోగి తన తప్పిదం లేకుండా కొత్త స్టేషన్‌లో చేరకపోతే (పరిపాలన కారణాల వలన) శాఖాధిపతి 30రోజుల వరకు జాయినింగ్ టైంగా ఎఫ్ఆర్ 106(5) పరిగణించే అవకాశం ఉంది. అధికారులు ఈ విష యంలో సరైన చర్యలు తీసుకునేందుకు ఆర్థికశాఖ సర్క్యులర్ మోమో నెం. 56300-ఏ/210/ఎఫ్ఆర్ఐ/2005 తేదీ 16-03-2005 ద్వారా ఆదేశాలు ఇచ్చింది. అధికారులు మూడు రోజుల వ్యవధి కంటే ఎక్కువ ఫైల్‌ను ఉంచుకున్న వారికి వారి నుంచే రికవరీ ఉత్తర్వులు ఇచ్చి ఫైనాన్స్‌కు పంపాలి. ఇందులో ఏ మాత్రం సడలింపునకు తావు లేదని సర్క్యులర్‌లో ఆర్థికశాఖ పేర్కొంది. సెలవులో నుంచి వచ్చిన, ఏ ఇతర కారణాల వలన వచ్చిన ఉద్యోగికి పోస్టింగ్ ఇవ్వకపోతే సంబంధిత ఉద్యోగులు మూడు రోజులకు మించి ఫైల్‌ను పరిష్కరించకుండా దగ్గర ఉంచుకుంటే ఆ రోజులను లెక్కగట్టాలి. సరిపడే జీతభత్యాలను లెక్కకట్టి ఆ మొత్తమును ఆ అధికారి దగ్గర నుంచి నిష్పత్తి ప్రకారంగా రాబట్టుటకు ఉత్తర్వులు ఇవ్వాలి.

ఉద్యోగ వర్గం

నిబంధనలు కార్యరూపం దాల్చడం లేదు

● భోగ శశిధర్, టీఎన్జీవోల జగిత్యాల జిల్లా కోకన్వీనర్



ప్రభుత్వ నిబంధనలు కార్యరూపం దాల్చడం లేదు. ప్రత్యేకంగా శాఖాధిపతుల కార్యాలయాల్లో ఉద్యోగి నుంచి సెలవు దరఖాస్తు ఇష్టపూర్వకంగా గాని, ఒత్తిడి తీసుకువచ్చిగాని సెలవుగా పరిగణిస్తున్నారు. ఈ విషయాల్లో ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలకు విన్నవిం చుకుంటే తగిన న్యాయం చేసేలా చర్యలు చేపడుతాం. ఉద్యోగులకు ఏ సెలవులు లేకపోతే జీతభత్యాలు లేని సెలవుగా పరిగణించుకోవచ్చు.

అదరగొట్టే: విండోస్ 10 ఫీచర్లు

● కొత్త వర్షన్‌లో ఎన్నో ఆప్షన్లు ● ఆకట్టుకుంటున్న లేటెస్ట్ ఆపరేటింగ్ సిస్టమ్

కోరుట్ల: 'మైక్రోసాఫ్ట్ విండోస్'.. అప్పట్లో విండోస్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టడం ఓ పెను సంచలనం.. ప్రపంచంలోనే ఎక్కువ కంప్యూటర్‌లలో వినియోగిస్తున్న ఆపరేటింగ్ సిస్టమ్ 'మైక్రోసాఫ్ట్ విండోస్'.. ఇప్పటికీ కంప్యూటర్ 'ప్లాట్‌ఫామ్'లో 'మైక్రోసాఫ్ట్ విండోస్'దే పైచేయిగా నిలుస్తోంది. ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లను ప్రవేశపెడుతు వినియోగదారులను ఆకట్టుకుంటోంది. మైక్రోసాఫ్ట్ 'ఎంఎస్ - డాస్' అపరేటింగ్ సిస్టమ్‌తో మొదలై 'జీయూఐ' (గ్రాఫికల్ యూజర్ ఇంటర్‌ఫేస్) ఆపరేటింగ్ సిస్టమ్‌గా ప్రపంచంలోనే నంబర్‌వన్ ఆపరేటింగ్ సిస్టమ్‌గా ఉంది. ఇటీవల 'మైక్రో సాఫ్ట్' ప్రవేశ పెట్టిన 'విండోస్-10' ఆపరేటింగ్ సిస్టమ్ వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 'విండోస్-10'లో కొత్తగా వచ్చిన ఫీచర్లపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

'విండోస్-10' పనిచేయాలంటే...

మీ పర్సనల్ కంప్యూటర్ లేదా ల్యాప్‌ట్యాప్, ట్యాబ్‌లెట్‌లలో 'విండోస్-10'ను వినియోగించాలంటే కొన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలి. విండోస్-10 అప్‌గ్రేడ్ చేసుకునే ముందు మీ సిస్టమ్‌లో అప్పటికే విండోస్-7 లేదా విండోస్-8.1 విననియోగించి ఉండాలి. దీంతో ఎలాంటి ఇబ్బంది లేకుండానే విండోస్-10కు అప్‌గ్రేడ్ అవ్వవచ్చు. విండోస్-10 ఇన్‌స్టాల్ చేసుకునే కంప్యూటర్,ల్యాప్‌టాప్‌లలో మినిమమ్ రిక్వైర్‌మెంట్‌లు కలిగి ఉండాలి. కంప్యూటర్‌లో 1జీహెచ్‌జెడ్ ప్రాసేసర్, కనీసం 1జీబీ ర్యామ్, 16 జీబీ హార్డ్‌డిస్క్ స్పేస్‌ను కలిగి ఉండాల్సి ఉంటుంది. వీటిని పరిగణలోకి తీసుకోకుండా మీరు 'విండోస్-10'ను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రయ త్నిస్తే కుదరదు. దీనికి తోడు ఒక్కోసారి డాటా కూడా తొలగిపోయే ప్రమాదాన్ని కొనితెచ్చుకునే అవకాశముంది. ఇన్ స్టాల్ చేసేముందే ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుంటే 'విండోస్-10' సేవలను ఆనందించవచ్చు.

కొత్త ఫీచర్లు ఇవే...

ఇటీవల విడుదలైన 'విండోస్-10' ఆపరేటింగ్ సిస్టమ్ ఫీచర్లు వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ ఆపరేటింగ్ సిస్టమ్ గురించి ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇప్పటికే సు మారు 1.5 కోట్ల మంది వినియోగదారులను 'విండోస్-10' కలిగి ఉంది. వచ్చే రెండు, మూడేళ్లలో వంద కోట్ల డివెస్‌లలో 'విండోస్-10' ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటారని సంస్థ అంచనా వేస్తోంది.

● విండోస్-8లో టచ్‌స్క్రీన్‌లో కూడా ఉపయోగించగలిగిన కొన్ని ఫుల్‌స్క్రీన్ అప్లికేషన్లను మైక్రోసాఫ్ట్ ప్రవేశ పెట్టింది. కానీ 'విండోస్-10' ఆపరేటింగ్ సిస్టమ్‌లో వీటిని ఐచ్ఛికంగా మార్చారు. 'విండోస్-10'ను డెస్క్‌టాప్, ట్యాబ్‌లెట్, స్మార్ట్‌ఫోన్‌లో కూడా ఎలాంటి మార్పు లేకుండా వినియోగించుకునే అవకాశం కల్పిస్తుండడంతో వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు.

● విండోస్-10లో పాతతరం విండోస్‌లోని స్టార్ట్‌అప్ మెనూను తిరిగి ప్రవేశపెట్టారు. విండోస్-8లో ఫుల్ స్క్రీన్ స్టార్ట్‌మెనూ ప్రవేశపెట్టారు. చాలా మంది ఈ మెనూను ఇష్టపడడం లేదని తేలడంతో విండోస్-10లో కొత్తగా స్టార్ట్‌అప్ మెనూను ప్రవేశ పెట్టారు. ఇప్పుడు కావాలనుకున్న వారు 'ఫుల్‌స్క్రీన్' మెనూను కూడా వినియోగించుకోవచ్చు.

● విండోస్-10లో 'కార్టానా' అనే కొత్త అప్లికేషన్‌ను అభి వృద్ధి చేశారు. దీని ప్రత్యేకత గొంతు శబ్దం గుర్తిం చడం. 'విండోస్-10' సిస్టమ్ ఎదుట కూర్చొని మనం ఇచ్చే ఆజ్ఞలను వింటుంది. మన అవసరాలను బట్టి ఎప్పటికప్పుడు స్పందిస్తుంది. ఏదైనామెయిల్‌ను పంపించడానికి 'కార్టానా'ప్రత్యేకంగా ఉపయోగపడనుంది. మనం ఆజ్ఞాపించడమే ఆలస్యంగా 'బార్'లోని ఇంటర్నెట్‌లో ఆ వాణిజ్య సంస్థ కు సంబంధించిన వివరాలను వెంటనే ఆటోమెటిక్‌గా సేకరిస్తుం ది. దీని ద్వారా ఒకే ఒక క్లిక్ ద్వారా ఎక్కడికైనా సులభంగా మెయిల్ పంపించుకోవచ్చు.

● విండోస్ స్టోర్‌లోని యూనివర్సల్ యాప్స్‌ను ఒక్కసారి డౌన్‌లోడ్ చేసుకుంటే... విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేసే డివైస్‌లన్నింటిలో ఇంటిగ్రేట్ అవుతాయి. ఇది వరకు విండోస్ డెస్క్ టాప్‌లకు మాత్రమే ఓపెన్‌గా ఉండేది. తరువాత ట్యా బ్స్‌కు, ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ మొబైల్‌కు ఓఎస్ అయింది. ఇలా మూడింటిలోనూ ఏ డివైస్‌కు తగినట్లుగా ఆ డిస్‌ప్లేను 'విండోస్-10'లోనే చూడ గల ము. మరే ఇతర ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఇలాంటి ఫీచర్ లేదు.

● సాధారణంగా గూగూల్ క్రోమ్, ఫైర్‌ఫాక్స్‌లతో పాటు విండోస్‌లో డిఫాల్ట్‌గా వచ్చే 'ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్' ఉంటుంది. 'విండోస్-10'లో ఇందుకు భిన్నంగా 'మైక్రోసాఫ్ట్ ఎడ్జ్' అనే కొత్త బ్రౌజర్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో అత్యాధునిక బ్రౌజర్లలో ఉన్న ఆప్షన్లు అన్నీ ఉంటాయి.



విండోస్-10 ఆప్షన్లు





విండోస్-10 లోగో

కొండగట్టు ఆలయ సమాచారం

కొండగట్టు శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో పూజల వివరాలు

మల్యాల:

1) ఉదయం 4 గంటలకు సుప్రభాతం
2) ఉదయం 4 గంటల నుంచి 5గంటల 30 నిమిషముల వరకు ఆరాధన
3) ఉదయం 5.30 నిమిషముల నుంచి 6 వరకు బాల బోగ నివేదన, హారతి అనుసంధానం.
4)ఉదయం 6 నుంచి సాయంత్రం 4 వరకు ధర్మదర్శనం.
5)ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఆర్జిత సేవలు, నిత్యహారతులు, అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చన, సత్యనారాయణస్వామి వ్రతాలు.
6)మధ్యాహ్నం 12గంటల నుంచి 12గంటల 30 నిమిషముల వరకు మహానివేదన, రాజబోగం.
7) మధ్యాహ్నం 12గంటల 30 నిమిషముల నుంచి ఒంటిగంట 30 నిమిముల వరకు సామూహిక భజన, తీర్థ ప్రసాద వితరణ.
8) మధ్యాహ్నం ఒంటి గంట 30 నిమిషముల నుంచి సాయంత్రం



4గంటల 30 నిమిషముల వరకు అష్టోత్తర శతనామార్చన, ధర్మధర్శనం.
9)సాయంత్రం 4గంటల 30 నుండి 6గంటల వరకు స్వామి వారి ఆరాధన, నివేదన అనుసందానం.
10) సాయంత్రం 6నుంచి రాత్రి 8గంటల వరకు ధర్మదర్శనం, కుంకుమార్చన.
11) రాత్రి 8గంటల 30 నిమిషములకు సామూహిక భజన, తీర్థ ప్రసాద వితరణ, కవట బందనం, ఆలయం మూసివేత.

పాతపెన్షన్‌తోనే ఉద్యోగులకు భద్రత

● రాపర్తి నర్సయ్య, టీఎస్‌సీపీఎస్ఈఊప జిల్లా ఉపాధ్యక్షుడు

రాయికల్ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంతో ఉద్యోగులకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. రాష్ట్రంలో చాలా మంది సీపీఎస్ ఉద్యోగులు మరణించారు. పదవీ విరమణ పొందారు. గ్రాడ్యూటీ లేకపోవడం వల్ల సహాయం అందడం లేదు. పదవీ విరమణ పొందిన తర్వాత సీపీఎస్ ఉద్యోగులకు ప్రయోజనాలు తక్కువే. ఒకే కార్యాలయం, పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ పాతపెన్షన్ వర్తింపజేయాలి. పాతపెన్షన్‌తోనే ఉద్యోగులకు వారి కుటుంబాలకు భద్రత, ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సీఎం పాతపెన్షన్ పునరుద్ధరిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం. పాతపెన్షన్ కోరుతూ సెప్టెంబర్ 1న సామూహిక సెలవులు పెట్టి జిల్లా కేంద్రాల్లో జరిగే నిరసన దీక్షలో ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొనాలి.



ఉద్యోగి వాయిస్

అడవి పందుల బెడదతో రైతు విలవిల

● మొక్కజొన్న పంటలు ధ్వంసం



పందులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

కథలాపూర్: అడవి పందుల బెడదతో రైతులు విలవిల్లాడుతున్నారు. పంటలు చేతికొచ్చే దశలో ఉండగా రాత్రి వేళల్లో పందులు మొక్కజొన్నను ధ్వంసం చేస్తున్నాయి. మండలంలోని తాండ్ర్యాల, పోతారం, చింతకుంట, ఇప్పపల్లి గ్రామాల్లో పందులు స్వైర విహారం చేస్తుండడంతో సుమారు 50 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మొక్కజొన్నకు ఇప్పటికీ రైతులు రెండు సార్లు కలుపు తీసి, రసాయనిక ఎరువులు వేసి లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. పంట చేతికచ్చే సమయంలో పందులు మొక్కజొన్న పంటను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోయారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారాన్ని అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

● ఈఈని అరెస్ట్ చేయాలని డిమాండ్



జగిత్యాలలో ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

జగిత్యాల టౌన్ : వెల్గటూర్ మండలం ఎండపెల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి దేవి శ్రీకాంత్ ఉన్నతాధికారి ఈఈ రఘువీరారెడ్డి వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడంటూ సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఈని వెంటనే అరెస్ట్ చేసి శ్రీకాంత్ కుటుంబానికి న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆందోళన చేపట్టారు. దీంతో తహసీల్ చౌరస్తా వద్ద గంటసేపు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. అనంతరం దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈఈ రాఘవరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ. 30లక్షల ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రభుత్వంలో ఉద్యోగులు పై అధికారుల ఒత్తిడికిలోనై ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండ శంకర్, ధర రమేష్ బాబు, బాలె శంకర్, కాయితి శంకర్, బడుగు రాజేందర్, కళ్లెపెల్లి దుర్గయ్య, ఎలమాద్రి కిషోర్, అటుకుల జాన్సన్, దుమాల రాజ్‌కుమార్, కడమండ కమలాకర్, వరుణ్, లక్ష్మణ్, అంజయ్య, ప్రభాకర్, నాగార్జున, శేఖర్, చంద్రయ్య, రాజు, ఎల్లయ్య, దీపక్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు స్పందన

● సమస్యలపై పలువురి ఫిర్యాదు



ఫోన్‌లో సమస్యలు వింటున్న పీడీ

జగిత్యాల టౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాలులో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ ప్రోగ్రాంకు స్పందన లభించింది. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలను డయల్ యువర్ కలెక్టర్ ప్రోగ్రాం ద్వారా డీఆర్‌డీఏ పీడీ అరుణశ్రీకి మొరపెట్టుకున్నారు. జగిత్యాల మండలం మోతె గ్రామానికి చెందిన తునికి పెద్ద గంగారాం ఎకరాకి 4వేల రూపాయల ఉచిత ఎరువులు, విత్తనాల జాబితాలో తన పేరు చేర్చాలని చల్‌గల్ గ్రామానికి చెందిన ఎడపెల్లి శ్రీను ఆస్తి విషయంలో పీడీకి ఫోన్‌లో విన్నవించారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి విష్ణు రైస్‌మిల్ నుంచి బస్‌డిపో ఆవరణలోకి డ్రైనేజీ వస్తుందని మొర పెటుకున్నారు. ఇలా జిల్లాలోని 10మంది తమ సమస్యలను విన్నవించారు. ప్రతి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామని పీడీ అరుణశ్రీ హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మహేశ్వర్, తహసీల్దార్ రాజమనోహర్ రడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొంగతనం ఆరోపణతోనే ఆత్మహత్య

● పోలీసులకు ఫిర్యాదు

కొడిమ్యాల: దొంగతనం నేరం మోపడంతో మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నల్లగొండ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. కొడిమ్యాల హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య కథనం మేరకు నల్లగొండ గ్రామానికి చెందిన కూన లచ్చయ్య ఇనుప నాగళిని ఎవరో ఎత్తుకెళ్లారు. దానిని కూన కొమురయ్య దొంగతనం చేస్తుండగా చూశామని కూన లచ్చయ్య, కూన రవిలు నేరం మోపారు. దీంతో బాధ భరించలేక మనస్తాపానికి గురై కొమురయ్య ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య తెలిపారు.

అధికారుల వేధింపులు సరికాదు

● ప్రభుత్వ సలహాదారు వివేకానంద
● శ్రీకాంత్ కుటుంబాన్ని ఆదుకుంటాం



శ్రీకాంత్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రభుత్వ సలహాదారు వివేకానంద

వెల్గటూర్: కింది స్థాయి అధికారులపై ఉన్నత స్థాయి అధికారుల వేదింపులు సరికాదని ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేకానంద పేర్కొన్నారు. మండలం లోని ఎండపెల్లి గ్రామానికి చెందిన ఈఈ దేవి శ్రీకాంత్ కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాంత్ కుటంబాన్ని ప్రభుత్వ పరండా ఆదుకుంటామని అన్నారు. ఎన్ని చేసినా పోయిన ప్రాణం తిరిగిరాదని, కుటుంబాన్ని ఆదుకోవడం కనీస ధర్మమని అన్నారు. దళితుడైన శ్రీకాంత్ కుటుంబ పరిస్థితులను అధిగమించి ఉన్నత చదువులు చదివి పీహెచ్‌డీ చేసి ఏఈఈ పోస్ట్ సాధించడం మామూలు విషయం కాదని అన్నారు. అలాంటి ఒక మేధావి అయిన యువ ఇంజనీర్‌ను వేదింపులకు గరి చేసి ఆయన ఆత్మహత్యకు కారణమైన ఈఈ రఘువీరారెడ్డిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫోన్ ద్వారా మాట్లాడినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా కూడా ఈఈపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈఈని సస్పెండ్ చేసి అతనిపై కేసుల నమోదుకు ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బషీర్, గాజుల మల్లేశం, కోటి లింగాల ఆలయ చైర్మెన్ పదిరె నారాయణరావు, జాడి రాజేశం, సూర్య నారాయణ పాల్గొన్నారు.

జగిత్యాలలో ఒకరికి డెంగ్యూ

జగిత్యాల టౌన్ : జిల్లా కేంద్రంలోని మహబూబ్‌పురాకు చెందిన ఖలీలొద్దీన్ అనే వ్యక్తి డెంగ్యూ వ్యాధికి గురయ్యాడు. ఖలీలొద్దీన్ రెండు మూడురోజులుగా అనారోగ్యానికి గురికావడంతో రక్తకణాలు తగ్గాయి. కుటుంబ సభ్యులు హుటాహుటినా కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఖలీలొద్దీన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.



ఆంధ్రజ్యోతి

ధర్మపురి

4

మంగళవారం 29 ఆగస్టు 2017

ధర్మపురి, బుగ్గారం, పెగడపల్లి, గొల్లపల్లి, మల్యాల, కొడిమ్యాల, వెల్గటూర్

మొక్కజొన్న చేనుకు చీరలే శ్రీరామ రక్ష!

మల్యాల : పక్షుల నుంచి మొక్కజొన్న పంటలకు నష్టం జరుగకుండా రైతులు మొక్కజొన్న పంట చుట్టూ రంగు రంగుల చీరలను ఏర్పాటు చేస్తున్నారు. చీరెలు మెరుస్తూ బెదురుగా కనిపిస్తుండటంతో ఆ పంటల దరిదాపుల్లోకి కూడా పక్షులు రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు చీరలను మొక్కజొన్న పంటల చుట్టూ ఇలా కట్టారు.



మొక్కజొన్న చేనుకు కట్టిన చీరలు

శిథిలావస్థలో డ్రైనేజీ

- సీసీ రోడ్లు లేక అవస్థలు
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

బుగ్గారం: కొన్ని దశాబ్దాలపాటు నియోజకవర్గ కేంద్రంగా బుగ్గారం ఉన్నప్పటికీ గ్రామంలో ఆశించిన స్థాయిలో మౌలిక సదుపాయాలు ఏర్పడలేదు. మండల కేంద్రంలో 4వ వార్డులో డ్రైనేజీ శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో వర్షపునీరు డ్రైనేజీ లేక మురుగునీరు ఇళ్ల లోకి చేరుతుందని వార్డు ప్రజలు మొరపెట్టుకున్నారు. కాని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీ లేక మురుగునీరు ఎక్కడికక్కడే నీరు నిలిచిపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తుంది. దీంతో పాటు విపరీతమైన దోమలు కూడా వ్యాపిస్తున్నాయి. దీని ద్వారా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఏర్పడటంతో ప్రజలు భయంతో ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఈ వార్డులో సీసీ నిర్మాణం లేక వర్షాకాలంలో బురదమయంగా మారి నడవలేకుండా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. సీసీరోడ్ల నిర్మాణంపై పలుసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. ఇకనైనా ఈ వార్డులో సీసీరోడ్ల నిర్మాణం కొరకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న డ్రైనేజీ



నిండిన డ్రైనేజీ

డ్రైనేజీ లేక ఇబ్బంది పడుతున్నాం..



సాత్పడి ప్రణయ్ కుమార్, 4వ వార్డు సభ్యుడు

4వ వార్డులో వర్షాకాలం వస్తే చాలు వర్షపునీరు ఇళ్లలోకి వస్తుంది. మురుగునీరు రోడ్డ మీదకు వస్తుంది. దీంతో దుర్వాసన వస్తుంది. డ్రైనేజీ సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.

సీసీరోడ్లు, డ్రైనేజీని నిర్మించాలి..



నగునూరి రామకిష్టి, 4వ వార్డు సభ్యుడు

4వ వార్డులో 20 సంవత్సరాలుగా సీసీరోడ్లు, డ్రైనేజీ లేదు. మురికి నీరు నిలిచిపోవడం వల్ల వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఇకనైనా ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని సీసీరోడ్లు, డ్రైనేజీలను నిర్మించాలి.

మౌలిక వసతుల కల్పనే రోటరీ క్లబ్ లక్ష్యం

-రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జె. అబ్రహమ్



బుక్‌లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ గవర్నర్ అబ్రహమ్

గొల్లపల్లి : ఉన్నత ప్రమాణాలతో కూడిన సామాజిక సేవేయే లక్ష్యంగా పాఠశాలల్లో సంపూర్ణ మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంతో పాటు తమ వంతుగా కృషి చేయటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జె. అబ్రహమ్ అన్నారు. సోమవారం చిల్వాకోడూర్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రోటరీ క్లబ్, ఆపీ, డా. గందె వెంకటేశ్వర్ సంయుక్త ఆధ్వర్యంలో 3500 విద్యార్థులకు నోట్ బుక్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అక్షరాస్యతా సాధన దిశగా 200కు పైగా దేశాల్లో సేవాభావంతో కృషి చేస్తుందన్నారు. హరిత హారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సిరిసిల్లా శ్రీనివాస్, రోటేరియన్స్ మంచాల కృష్ణ, టీవీ. సూర్యం, డా. వెంకటేశ్వర్, రామారావు, ఆంటోని ముత్తు, హెచ్‌ఎం రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఆర్‌వోపై మంత్రికి ఫిర్యాదు

మల్యాల : మండలంలోని నూకపల్లి వీఆర్‌వోపై రామన్నపేటకు చెందిన బండారి ఆనందరావు సోమవారం పెగడపల్లికి వచ్చిన రాష్ట్ర మంత్రి హరీష్‌రావుకు ఫిర్యాదు చేశాడు. నూకపల్లి శివారులో గల సర్వే నెం.262లో గల తన 9గుంటల భూమిని నూకపెల్లికి చెందిన ఓ వ్యక్తికి అవినీతికి పాల్పడి పట్టామార్పిడి చేశాడని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను వీఆర్‌వోను సంప్రదిస్తే ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, విచారణ జరిపి వీఆర్‌వోపై తగు చర్యలు తీసుకోవాలని ఆనందరావు మంత్రిని కోరారు. పైగా ఇప్పుడున్న అధికారులు మోసాలకు బదిలీ కాకముందు 2011 వరకు ఆన్‌లైన్ పహణీతో నమోదై ఉండగా 2017 వరకు పాత పట్టాదారులను తొలగించి కొత్తగా మార్పు చేశారని ఆయన ఆరోపించారు.

మీజిల్స్ రుబెల్లా టీకాలు పంపిణీ వైద్య శిబిరం

గొల్లపల్లి: చెందోళి క్లస్టర్ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు, చిన్నారులకు మీజిల్స్ రుబెల్లా టీకాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్యారోగ్య శాఖ సిబ్బంది వేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎమ్ నిర్మల, హెల్త్ సూపర్ వైజర్లు ద్వారక, రమేష్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సామూహిక సెలవును విజయవంతం చేయాలి

ధర్మపురి: సెప్టెంబర్ 1 న ఖిలాఫత్ దివాస్ సామూహిక సెలవును విజయవంతం చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈపీ మండల అధ్యక్షులు వీరబత్తిని శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులతో కలిసి తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంఈవో రాజమహేందర్‌రెడ్డి గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈపీ ప్రధాన కార్యదర్శి సతీష్, నాయకులు శ్రావణ్‌కుమార్, మహేష్, జ్యోతిర్మయి, శ్రీపతి, గోవర్ధన్, రమేష్, శ్రీనివాస్, వెంకటరమణ, దివాకర్, వేణుగోపాల్, జనార్దన్, భీమన్న పాల్గొన్నారు

వెల్గటూర్‌లో..

సీపీఎస్ విధానాన్ని నిరసిస్తూ సెప్టెంబర్ 1న సామూహిక సెలవు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎస్ ఉపాధ్యాయులు సోమవారం ఎంఈవో చంద్రయ్యకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సంతోష్ కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

నేడు నల్ల బ్యాడ్జీలతో వినతి పత్రాలు

కొడిమ్యాల: జిల్లాలోని సాక్షరభారతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అన్ని మండలాల ఎంపీడీవోలకు నల బ్యాడ్జీలు ధరించి వినతి పత్రాలు అందించాలని జిల్లా కోఆర్డినేటర్ల సంఘం అధ్యక్షుడు జలేందర్‌గౌడ్ కోరారు. సోమవారం కొడిమ్యాలలో విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులకు బీమా సౌకర్యం, కనీస వేతనం, హెచ్‌ఆర్‌ఏను ప్రకటించాలన్నారు. ఉద్యోగులంతా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెక్ అందజేత

కొడిమ్యాల: కొడిమ్యాల గ్రామంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి సర్పంచ్ పిడుగు ప్రభాకర్‌రెడ్డి 1లక్ష 116 రూపాయల చెక్‌ను అందించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు లక్ష్మారెడ్డి, జనార్దన్, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, మహేష్, రవీందర్, దేవయ్య, టీడీపీ నాయకుడు నర్సాగౌడ్, సత్యం ఉన్నారు.

వృక్షాల తొలగింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మల్యాల: మండలంలోని తాటిపెల్లి గ్రామంలో ట్రాన్స్‌కో సిబ్బంది ఎలాంటి అనుమతులు లేకుండా, వృక్షాలను తొలగిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ నాయకులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. హరితహారం పేరిట ప్రభుత్వం మొక్కలు నాటడానికి కృషి చేస్తుంటే అధికారులు మాత్రం ఏపుగా పెరిగిన పెద్ద చెట్లను తొలగిస్తున్నారని కోరారు. జిల్లా కార్యదర్శి బింగి వేణు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

సామర్థ్యాలను మెరుగు పర్చాలి

కొడిమ్యాల: ప్రతి పాఠశాలలో తెలుగు,గణితం ఆంగ్లంలపై పది రోజులకోసారి విద్యార్థులకు పరీక్షలను నిర్వహించి కనీస ప్రాథమిక సామర్థ్యాన్ని పెంచాలని సెక్టోరియల్ ఆఫీసర్ బాలకిషన్ అన్నారు. సోమవారం కొడిమ్యాలలోని ఆదర్శ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్ రావు, కాంప్లెక్స్ చైర్మెన్‌లు నాగరాజు, వేణుమూర్తి, సూర్యప్రకాష్‌రావు, కార్యదర్శి ఆదిరెడ్డి, రిసోర్స్ పర్సన్‌లు ఆరేటి వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, దేవేందర్‌రావు, సీఆర్పీలు ,హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30 నుంచి ఇంటర్వ్యూలు

వెల్గటూర్: ఎస్సీ ఆక్షన్ ప్లాన్ ఇంటర్వ్యూలు ఈ నెల 30 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పురుషోత్తం రావు తెలిపారు. 30న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రాజారాంపెల్లి పరిధి లోని గ్రామాల వారికి ఉదయం 11 గంటలకు, కుక్కలగూడూర్ పరిధి లోని గ్రామాల వారికి మధ్యాహ్నం 2 గంటలకు, 31న ధర్మారం ఆంధ్రబ్యాంక్ పరిధిలోని గ్రామాల వారికి ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

జాగృతి కన్వీనర్‌గా సిరంగి



వెల్గటూర్: తెలంగాణ జాగృతి నియోజకవర్గ కన్వీనర్‌గా మండలకేంద్రానికి చెందిన సిరంగి సంతోష్ కుమార్ రెండవ సారి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనకు జిల్లా కన్వీనర్ అమర్‌దీప్ గౌడ్ నియామక పత్రం అందజేశారు.

వినాయక మండపాల్లో పూజలు

- మంత్రి హరీష్‌రావుకు సన్మానం
- 251 భోగాలతో నైవేద్యం

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని వినాయక మండపాల్లో సోమవారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. బ్లూస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ పూజలు చేశారు. మంత్రిని యూత్ ఆధ్వర్యంలో బండి చింటు శాలువా కప్పి సన్మానించారు. దేవాలయం ఎదుట ఆర్యవైశ్య గణేష్ భక్త మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన మండపంలో గణనాథుడికి 251 రకాల పిండి పదార్థాలు తయారు చేసి నైవేద్యం సమర్పించారు.



బ్లూస్ యూత్ ఆధ్వర్యంలో హరీష్‌రావుకు సన్మానం



పూజలు చేస్తున్న ప్రభుత్వ సలహాదారు వివేక్

వినాయకుడికి వివేక్ పూజలు

వెల్గటూర్: రాజారాంపెల్లి గ్రామంలో సోమవారం ప్రభుత్వ సలహాదారు గడ్డం వివేకానంద వినాయకుడికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బషీర్, గాజుల మల్లేశం, జాడి రాజేశం, పదిరె నారాయణ రావు, కాడె సూర్యనారాయణ, గాజుల లక్ష్మణ్, గాజుల విజయ్, శ్రీధర్, స్వామి, సాగర్, రెబల్ స్టార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భూసేకరణకు రైతులు సహకరించాలి

- ఆర్డీవో నరేందర్

కొడిమ్యాల: కొడిమ్యాల నుంచి చింతలపల్లి వైపు తీసే కాల్వ భూసేకరణకు రైతులంతా సహకరించాలని జగిత్యాల ఆర్డీవో నరేందర్ కోరారు. సోమవారం కాల్వ కింద భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో గౌడ సంఘ భవనంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. రైతులు సహకరిస్తే పనులు పూర్తయి బీడు భూములకు నీరు చేరుతుందన్నారు. ఎకరా భూమికి ఆరు లక్షల రూపాయలు ఇవ్వటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆర్డీవో తెలిపారు. దీనికి రైతులు ఒప్పుకోలేదు. రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకపోతానని ఆర్డీవో తెలిపారు. ఈ విషయమై గురువారం రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది. సమావేశంలో ఈఈ శివకుమార్, తహసీల్దార్ రవీందర్‌రావు, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి ఉపాధ్యక్షుడు రాజేశం, సింగిల్‌విండో చైర్మెన్ కృష్ణారావు, ఎంపీ టీసీ శ్రీనివాస్, టీఆరెస్ నాయకుడు రాజేశం, రెవెన్యూ పరిశీలకుడు రామఅఖిలేష్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో నరేందర్

పైడిపెల్లి యువకుల శ్రమదానం

వెల్గటూర్: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడ లేదు ఆ గ్రామ యువకులు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చేయలేని పనిని వారే స్వయంగా చేసి శభాష్ అనిపించుకున్నారు. పైడిపెల్లి గ్రామంలో చెట్లు ఏపుగా పెరిగి రోడ్డుకు అడ్డంగా ఉండి ఇబ్బంది అవుతుండడంతో ఎవరికి చెప్పినా పట్టించుకోక పోవడంతో యువకులే నడుం బిగించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. బురదగా ఉన్న రోడుపై కొంత మట్టిని పోశారు. కార్యక్రమంలో అజయ్, శ్రీను, సంతోష్, కుమార్, మహేష్ రాజు, రాము, ఉమేష్, రమేష్, స్వామి, రఘు, హరీష్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా తట్టు, రూబెల్లా టీకాల పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో సోమవారం తట్టు, రూబెల్లా టీకాల పంపిణీని విస్తృతంగా నిర్వహించారు. గ్రామంలోని తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు చిన్నారులకు టీకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగ గంగస్వామి, హెల్త్ హెచ్ఈఓ రాజశేఖర్, సూపర్‌వైజర్లు శంకర్, హేమలత, విజయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల్లో టీడీపీ గెలుపుపై సంబరాలు

మెట్‌పల్లి: నంద్యాల శాసనసభ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి విజయం సాధించడాన్ని స్వాగతిస్తూ సోమవారం మెట్‌పల్లి మండలం వెంకట్రావుపేటలో టీడీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టపాసులు పేల్చి పలువురికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కొమిరెడ్డి లింగారెడ్డితో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలను కించపరిస్తే సహించేది లేదు...

మెట్‌పల్లి: బీసీలను కించపరిచేలా వ్యవహరిస్తే సహించేది లేదని, ప్రభుత్వం ఇందుకు ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టాలని టీబీసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి కృష్ణమూర్తి కోరారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయ కులు మనోజ్, శ్రీరాం రాజు, పోతుగంటి కృష్ణ, దువ్వ నర్సయ్య, నాగరాజు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

మల్లాపూర్: ఈ నెల 29, 31వ తేదీల్లో ఎస్సీ కార్యచరణ ప్రణాళికలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ స్వరూప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో అభ్యర్థులకు తమ తమ బ్యాంకు పరిధిలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. 29న సిండికేట్ బ్యాంక్(వేంపేట, మొగిలిపేట), మల్లాపూర్ కేడీసీసీ బ్యాంకు పరిధిలో, 31న ముత్యంపేట ఇండియన్ బ్యాంక్, మల్లాపూర్ ఆంధ్రాబ్యాంక్ పరిధిల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం 213 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

బాధితులకు నగదు పంపిణీ

మల్లాపూర్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని రాఘవపేటలో బాధిత కుటుంబీలకు సోమవారం నగదు, వస్త్రాలను పంపిణీ చేశారు. మంగళారపు రాజేందర్ అను వ్యక్తి కొన్ని రోజుల క్రితం దుబాయిలో మృతిచెందగా అతని కుటుంబీలకు జేసీబీ కంపెనీ సేల్స్ మేనేజర్ రమేశ్ రూ. 10 వేల నగదును అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మల్లాపూర్ అద్యక్షుడు దేవ మల్లయ్య, కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, చైర్మన్ శ్రీనివాస్, లక్ష్మీనారయణ, అమీనోద్దీన్, నాయకులు నర్సారెడ్డి, రాంరెడ్డి, నత్తి నర్సయ్య, నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

సిర్‌పూర్‌లో అన్నదానం

మల్లాపూర్: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని సిర్‌పూర్‌లో తెలంగాణ టైగర్స్ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు భక్తులు, యూత్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో లక్ష్యాన్ని పూర్తి చేయాలి

● మెట్‌పల్లి ఎంపీడీఓ వెంకటేశ్ జాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్ జాదవ్

మెట్‌పల్లి: హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సమిష్టి కృషితో సాధించాలని మెట్‌పల్లి ఎంపీడీఓ వెంకటేశ్ జాదవ్ పేర్కొన్నారు. సోమవారం మెట్‌పల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో హరితహారం, బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఇప్పటి వరకు మండలంలో 70 శాతం మొక్కలు నాటామని, మరో 30 శాతం మొక్కలు నాటితే లక్ష్యం పూర్తవుతుందని తెలిపారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న చీరల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామాల్లో వచ్చే నెల 18, 19వ తేదీల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మెట్‌పల్లి తహసీల్దార్ సుగుణాకర్‌రెడ్డి, మండల విద్యాధికారిణి కొండ కనకతార, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీడు భూములను సాగులోకి తెస్తాం...

● ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

మెట్‌పల్లి: నియోజకవర్గంలోని బీడు భూములను తిరిగి సాగులోకి తేవడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యా సాగర్‌రావును ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్ రావుపేట గ్రామానికి చెందిన పలువురు రైతులు, రైతు సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల కాళేశ్వరం ఎత్తిపోతల రివర్స్‌పంపు సెట్‌లో భూమి కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించడంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల కృషి చేశారని పేర్కొంటూ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిస్తోందన్నారు. రైతులకు అన్యాయం జరగకుండా ఉండాలన్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక కృషి చేసి బాధిత రైతులకు సరైన పరిహారం అందించారని పేర్కొన్నారు. ఇందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ మార్గం గంగా దర్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బర్ల సాయన్న, నాయకులు నల్ల వెంకటేశ్, పన్నాల మాధవరెడ్డి, పరమేశ్వర్, నోముల కృష్ణమూర్తి, రాజు, గంగాదర్, క్రాంతి, సాయన్న, నారాయణ, చిన్నయ్య, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

● మెట్‌పల్లి డీఎస్పీ మల్లారెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ మల్లారెడ్డి

మెట్‌పల్లి: విద్యార్థులు క్రమశిక్షణ పాటించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని మెట్‌పల్లి డీఎస్పీ మల్లారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మనోహర గార్డెన్స్‌లో పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులకు మానసిక వికాసంపై ఈశ్వరీయ బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మల్లారెడ్డి మాట్లాడారు. విద్యార్థులు చెడుతోవలో వెళ్లి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. మంచి మార్గలను ఎంపిక చేసుకోవాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయడంలో ముందుండాలని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి జ్ఞానోదయ కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్‌తో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన ఉపన్యాసకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆధ్యాత్మికతను అలవరుచుకోవాలి

● త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి

ప్రతీ విద్యార్థి ఆధ్యాత్మికతను అలవరచు కోవాలని శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. సోమవారం పట్టణ శివారులోని నరేంద్ర డిగ్రీ కళాశాలలో త్రిదండి రామనుజ సహస్రాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇంటింటి ఆహ్వాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరై దేవనాథ రామానుజ జీయర్ స్వామి మాట్లాడారు. మానవులంతా ఐక్యమత్యంతో ఉండాలన్నారు. సమాజంలో సమానత్వం పెంపొందాలంటే విద్యార్థులు, యువకులు ఆధ్యాత్మికత వైపునకు నడువాలన్నారు. ఆధ్యాత్మికత వల్ల బహుళ ప్రయో జనాలు అందు తాయన్నారు. కుల, మత, వర్గ, వర్ణ విబేధా లను విడనా డాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావుపేట గ్రామ సర్పంచ్ కొమిరెడ్డి లింగారెడ్డి, నరేంద్ర డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ గుజ్జేటి నరేందర్, వైస్ ప్రిన్సిపాల్ కల్వకోట చంద్రప్రకాశ్, అధ్యాపకులు సంతోష్, రమేశ్, గణేశ్, మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రిదండి దేవనాథ జీయర్ స్వామి

పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి..

● మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్

మెట్‌పల్లి: ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సంపూర్ణ సహకారంతో మెట్‌పల్లి పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి ఉమారాణి అన్నారు. సోమవారం పట్టణంలోని 11, 12వ వార్డుల్లో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 3 లక్ష లతో నూతనంగా చేపడుతున్న మురికి కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. వార్డుల్లో పర్యటించి పలు సమస్యలను అడిగి తెలుసు కున్నారు. పట్టణ ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు. వార్డుల్లోకి వచ్చే మున్సిపల్ సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, ఆయా వార్డుల కౌన్సిలర్లు బొర్రొళ్ల గంగారాం, చెట్లపల్లి మీనా సుఖేందర్, నాయకులు మర్రి సహదేవ్, ద్యావతి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నవరాత్రోత్సవాలు

మెట్‌పల్లి: వాడవాడన వినాయక నవరాత్రోత్సవాలు సోమవారం మెట్‌పల్లిలో ఘనంగా జరిగాయి. పలు మండపాల నిర్వాహకులు పేదలకు అన్నదానం చేశారు. స్థానిక కళానగర్‌లో గల మెట్‌పల్లి క్లబ్‌లో రాంనగర్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. అదే విధంగా పట్టణ అనుబంధ గ్రామమైన రేగుంట రోడ్డు వైపున గల పటేల్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు జెట్టి లింగం హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగడి బజార్‌లో గల ఇండియన్ లయన్స్ యూత్ సభ్యులు నవరాత్రోత్సవాల్లో భాగంగా శివ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కాగా పట్టణంలో గత ఏడేళ్లుగా కర్ర వినాయక విగ్రహాన్ని ప్రతిష్టాపించి ఉత్సవాలు నిర్వహిస్తున్న స్థానిక సున్నం బ్రహ్మయ్యను స్నేహాలయ ఫ్రెండ్స్ అసో సియేషన్ అధ్యక్షుడు కోట కిరణ్‌కుమార్, నాయకులు ఎలంగందుల నవీన్, ప్రసాద్ తదితరులు ఘనంగా సన్మానించారు. కాగా పట్టణంలోని చెన్నకేశవ నాథ స్వామి ఆలయ సమీపంలో ఇంద్రసేన ఆధ్వర్యంలో ప్రతిష్టాపించిన భారీ వినాయక విగ్రహం పలువురిని విశేషంగా ఆకట్టుకుంటుంది.

● గణనాథునికి 51 రకాల నైవేద్యాలు

పట్టణంలోని ఆదర్శ నగర్‌లో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం గణనాథునికి భక్తులు 51 రకాల నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాసుకంటి శ్రీను, శ్యామ్, ముక్క వినయ్, ముక్క నరేశ్, ముఖేశ్, రామారావు, ప్రకాశ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

●కన్నుల పండువగా దద్నాభిషేకం

పట్టణంలోని వాసవి మాత ఆలయంలో కొనసాగుతున్న వినాయక నవరాతో్రత్సవాల్లో భాగంగా సోమవారం వినాయకుడికి దద్నాభిషేకాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దొంతుల రాజ్‌కుమార్, నాయకులు తోట పెంటయ్య, మహజాన్ శివకుమార్, కోట కిరణ్ కుమార్, బండారి మారుతీ, నవీన్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని తహసీల్దార్ సుజాత, గ్రామ సర్పంచ్ నేమూరి లత తదితరులు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అన్నపూజ అందుకుంటున్న వినాయకుడు

హరితహారాన్ని విజయవంతం చేయాలి

జగిత్యాల టౌన్: జిల్లా కేంద్రంలోని 38 వార్డుల్లో లక్ష్యం మేరకు మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బల్దియా చైర్‌పర్సన్ విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం 4, 30వ వార్డుల్లో మొక్కలు నాటారు. అనంతరం కాలనీల్లో పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అల్లాల సరిత రమేష్‌రావు, చిట్యాల గంగాధర్, నక్క గంగారాం, నక్క గోపాల్, బొల్లారపు గంగమల్లు, దుబ్బయ్య, బాల గంగాధర్, రిసోర్స్‌పర్సన్ జ్యోతి, ఏఈ లచ్చిరెడ్డి, సానిటరీ సిబ్బంది విజయ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో..

బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి, కండ్లపెల్లి గ్రామాల్లో సోమవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై గజేంధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో 2500 ఈత మొక్కలను నాటారు. సర్పంచులు చెరుపూరి నీరజ సుభాష్, దోసారపు జెగునశ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ సూద నారాయణ, ఈసీ శరత్‌బాబు, రాంచంద్రగౌడ్, రాజేశం గౌడ్, రాజేందర్ గౌడ్, నర్సయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్



నర్సింహులపల్లిలో మొక్క నాటుతున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

హలో..హలో..

జగిత్యాల మండల స్థాయి అధికారుల ఫోన్ నంబర్లు

శ్రీలతరెడ్డి,ఎంపీడీవో	9849900096
రాజమనోహర్‌రెడ్డి, తహసీల్దార్ రూరల్	7995084616
శశిధర్,డిప్యూటీ తహసీల్దార్	7386780414
కిరణ్ కుమార్,రూరల్ ఎస్సై	9440795137
గాయత్రి,ఎంఈవో	9348838919
దివ్యశ్రీ,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	7995660440
షంషీర్ అలీ,ఏఈపీఆర్	9849365471
విమోచన,ఐకేపీఏపీఎం	9652404764
అన్వేష్, ఉద్యానశాఖ అధికారి	8008824088
గంగలక్ష్మణ్, ఇన్‌ఛార్జి(ఈజీఎస్ ఏపీవో)	7095515986
జైపాల్‌రెడ్డి ఇన్‌చార్జి(వైద్యాధికారి)	9866239255
రాజశ్రీ,ఐసీడీఎస్‌సూపర్‌వైజర్	7095556281
రఘునాథ్,ఏఈ ట్రాన్స్‌కో	9491058667
శ్రీనివాస్‌రెడ్డి,పశువైద్యాధికారి	9491550154
రాజేష్ కుమార్, ఇరిగేషన్ ఏఈ	9963135920
దయాకర్ టెక్నికల్ అసిస్టెంట్ ఈజీఎస్	7095515293
గోపాల్,ఎంసీవో	9550849140
గంగారాం,సూపరిండెంట్ (ఎంపీడీవో కార్యాలయం)	9441717912

రాయికల్ అధికారులు

శివాజీ,ఎంపీడీవో	9912586929
చంద్రప్రకాశ్,తహసీల్దార్	9866991599
పుష్పలత, డిప్యూటీ తహసీల్దార్	9392149332
శివకృష్ణ,ఎస్సై	9440795143
శ్యాంసుందరాచారి,ఎంఈవో	9949096101
ఆనందం,ఆర్‌డబ్ల్యూఎస్,ఏఈ	9949300286
ప్రసాద్,పీఆర్,ఏఈ	9849668138
శ్రీనివాస చక్రవర్తి, ఐకేపీ ఏపీఎం	9959322202
అనీల్, ఉద్యాన అధికారి	8374449894
కొంరయ్య, ఏపీవో	7095515827
శ్రీనివాస్, వెద్యాధికారి	8978627395
మమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్	9440839961
శ్రీనివాస్, ఏఈ ట్రాన్స్‌కో	9440811468
శ్రీనివాస్, పశువైద్యాధికారి	9966656629
భాస్కర్, ఇరిగేషన్ ఏఈ	9885444385
గంగరెడ్డి,ఎంసీవో	9959263265
శాఖీర్ అలీ, సూపరింటెండెంట్ ఎంపీడీవో కార్యాలయం	7093876699
శ్యాంసుందర్‌రావు,ఈవోపీఆర్డీ	9441357276
గంగాధర్, ఈవో	9000001876
నరేంధర్‌రావు, రేంజర్	9440810383
అనీల్,వ్యవసాయాధికారి	7288894125

కొడిమ్యాల అధికారులు

వెంకటలక్ష్మి,తహసీల్దార్	8184930980
రమేష్, ఎంపీడీవో	9849094809
కిరణ్‌కుమార్, ఎస్సై	9440795283
వెంకటేశ్వర్‌రావు, ఎంఈవో	9949676885
జబ్బర్, ఏఈఈ,పీఆర్	9701576214
మణిదీప్, ఏఈఈ,ఆర్‌డబ్ల్యూఎస్	9030090394
ఓంకార్ ఏఈఈ(ట్రాన్స్‌కో)	9440811474
రజిత, ఏపీఎం (ఐకేపీ)	9177633373
వంశీకృష్ణ, పీహెచ్‌సీ,వైద్యుడు	9885334222
ప్రసాద్, వెటర్నరీ వైద్యుడు	8790997693

వినాయక మండపాల వద్ద అన్నదానం



అన్నం వడ్డిస్తున్న సంజయ్ కుమార్



గోపాల్‌రావుపేటలో..

జగిత్యాల రూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలోని సోమవారం గణపతి మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మండపాల వద్ద టీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జలగం అజిత్ రావు, టీఆర్‌ఎస్ మండల సంయుక్త కార్యదర్శి చెట్లపల్లి మోహన్‌రెడ్డి, ఎల్ల రాజన్న, జంగ గంగారాం, సురేష్, మహేష్, రాము గౌడ్, దిలీఫ్, శ్రావణ్, మనోజ్ పాల్గొన్నారు.

మోరపల్లి గ్రామంలో వినాయక మండపాల వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రెడ్డి యూత్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట గ్రామాల్లోని వినాయకుల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగం మహేష్, సర్పంచ్ రౌతు గంగాధర్, ఉపసర్పంచ్ సతీష్, అంబేద్కర్ సంఘం ప్రెసిడెంట్ చింతకుంట్ల గంగాధర్, మున్నూరు కాపు సంఘం నాయకులు, అంబేద్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని తుంగూర్‌లో మ్యాదరి సంఘం ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద సోమవారం గ్రామస్థులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సారంగాపూర్: రేచపల్లి గ్రామంలో నెహ్రూ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అంతకుముందు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అధ్యక్షులు స్వామి, రాజు, ప్రవీణ్, మధు, రామ్‌కీ, నవీన్, సంతోష్, హరీష్ పాల్గొన్నారు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

జగిత్యాల అర్బన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బల్దియా చైర్‌పర్సన్ టి.విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 జూనియర్ కళాశాలల జిల్లా క్రీడలను సోమవారం బల్దియా చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఇందులో భాగంగా బాలబాలికలకు ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర విభాగం ఫైనల్‌లో మంథని గురుకుల కళాశాల, మేడిపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల క్రీడకారులు తలపడ్డాయి. మంథని గురుకుల కళాశాల క్రీడాకారుల జట్టు మొదటి స్థానంలో నిలిచింది. బాలికల విభాగం ఫైనల్‌లో రామగుండం సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల టీంతో మల్లాపూర్ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల టీం సభ్యులు తలపడ్డాయి. రామగుండం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. సాయంత్రం నిర్వహించిన క్రీడల ముగింపు కార్యక్రమంలో ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామశర్మ బహుమతులు అందజేశారు. పీడీలు ఎల్.హరిరామ్, బి.రాజశేఖర్, అనిత, అనూష, క్రీడాకారులు పాల్గొన్నారు.

జగిత్యాల విద్యార్థినికి ఇన్‌స్పైర్ అవార్డు



పూజ

జగిత్యాల అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీ వాణి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని నాగూరి పూజ కేంద్ర ప్రభుత్వం అందించే ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైంది. ఇంటర్ బైపీసీలో 982 మార్కులు సాధించడంతో అవా ర్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పూజను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

చింతకుంట చెరువును ఎస్సారెస్పీ నీటితో నింపుతాం



చెరువును పరిశీలిస్తున్న చైర్ పర్సన్

జగిత్యాల టౌన్: జిల్లా కేంద్రంలోని మంచి నీళ్లబావి సమీపంలో ఉన్న చింతకుంట చెరువును ఎస్సారెస్పీ నీటితో నింపనున్నట్లు, వినాయక నిమజ్జన కార్యక్రమానికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు బల్దియా చైర్‌పర్సన్ విజయలక్ష్మిదేవేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం చింతకుంట చెరువుతో పాటు పట్టణానికి తాగునీరందించే ధర్మ సముద్రం చెరువును చైర్ పర్సన్ పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ప్రతిష్ఠించిన వినాయకులను ఏటా చింతకుంట చెరువులో నిమజ్జనం చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం చింతకుంట చెరువులో మీటర్ నీరు మాత్రమే ఉందని, ధర్మసముద్రం చెరువును ఎస్సారెస్పీ నీటితో నింపి మత్తడి నీటితో చింతకుంట చెరువును నింపేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు.ఇప్పటికే వాటర్ సప్లయి ద్వారా వృథా నీటిని చింతకుంట చెరువుకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఏఈ లచ్చిరెడ్డి, సరితరమేష్‌రావు,రాము,శ్రీనివాస్ పాల్గొన్నారు.

తృతీయ సోపాన్ శిక్షణ శిబిరం ప్రారంభం

జగిత్యాల అర్బన్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ సోమవారం జగిత్యాలలో ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని కేజీఆర్ పబ్లిక్ స్కూల్‌లో ఐదు రోజులపాటు నిర్వహించే ఈ శిబిరానికి ఉమ్మడి జిల్లా పరిధిలోని స్కౌట్స్ హాజరయ్యారు. క్యాంప్ ప్రారంభోత్సవం సందర్భంగా ట్రస్మా అధ్యక్షుడు కె.గంగారెడ్డి జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించేందుకు శిబిరాలు దోహదం చేస్తాయన్నారు.ఈ స్కౌట్స్ శిక్షణ ప్రతీ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. స్కౌట్ మాస్టర్లు, బియ్యాల హరిచరణ్‌రావు, నాగరాజు, నర్సింగారావు, రవీంద్రనాథ్, నర్సయ్య, సదయ్య, వెంకటేశ్వర్లు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రస్మా అధ్యక్షుడు గంగారెడ్డి

ఆంధ్రజ్యోతి
5★
కోరుట్ల
మంగళవారం 29 ఆగస్టు 2017
కోరుట్ల, కోరుట్ల రూరల్, కథలాపూర్

బస్టాండు నిర్మాణానికి స్థలం కేటాయించాలి

కోరుట్ల: మండలంలోని అయిలాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నూతన బస్టాండును ఏర్పా టు చేయడానికి ఒక గుంట స్థలాన్ని కేటాయించాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు యూత్ సభ్యులు సోమవారం కోరుట్ల తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. కోరుట్ల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణను కలిసి సమస్యను విన్నవించారు. బస్టాండు లేకపోవడం వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్టాండు నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు వేల్పుల నరేశ్, పాశం విజయ్, తమ్మెళ్ల రాజేశ్, అర్ప సుధాకర్, వెల్పుల రణధీర్, ఓరుగంటి ప్రభాకర్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్‌కు నిధులు మంజూరు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో బతుకమ్మ ఘాట్‌కు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమ రూ. 2 లక్షలు మంజూరు చేశారని టీఆర్ఎస్ నాయకులు జాజాల విశ్వేశ్వర్‌రావు, కిషన్ రావులు తెలిపారు. జడ్పీ సీనరేజ్ గ్రాంట్ కింద ఈ నిధులు మంజూరైనట్లు తెలిపారు. నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు.

వరిలో తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కథలాపూర్: ప్రస్తుత సీజన్‌లో వరిపై తాటాకు తెగులు, జింకులోపం వంటి తెగుళ్ల ఆశిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈఓలు రవళి, అక్షయ్‌లు తెలిపారు. పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. జింకులోప నివారణకు చిలేటేడ్ జింక్ 200 గ్రాములు లీటర్ నీటికి, తాటాకు తెగులు నివారణకు ప్రొఫినోపాజ్ 2 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేసుకోవాలన్నారు.

గంభీర్‌పూర్ అభివృద్ధికి రూ. కోటి నిధులు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామాభివృద్ధికి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు కోటి రూ పాయల నిధులు ఇచ్చేందుకు స్పష్టమైన హామీనిచ్చారని టీఆర్ఎస్ నాయకులు వెగ్యారపు లింబాద్రి, జలెందర్‌లు తెలిపారు. అదే విధం గా గ్రామంలో జూనియర్ కళాశాల మంజూరుకు విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

తాండ్ర్యాలలో 'పది' నిర్వాహణకు అనుమతి

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో పదోతరగతి నిర్వాహణకు అనుమతి లభించిందని సర్పంచ్ చిన్న నాగమల్లేశ్, ఎంపీటీసీ పానుగంటి విజయలక్ష్మీ, ఎస్ఎంసీ చైర్మన్ హైమద్‌లు తెలిపారు. ఇప్పటి దాకా 9వ తరగతి దాకా తరగతులకు అనుమతి ఉండగా ప్రస్తుతం పదో తరగతికి జిల్లా విద్యాధికారి అనుమతి ఇచ్చారని చెప్పారు. దీనికి కృషి చేసిన జిల్ల పరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కోరుట్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కోరుట్ల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. పలువురు విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

30నుంచి మండల స్థాయి క్రీడలు

కథలాపూర్: ఈ నెల 30, 31వ తేదీల్లో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఆనందరావు తెలిపారు. 30న అండర్ 17 బాలికల విభాగం, 31న బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహి స్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను వెంట తీసుకరావాలని కోరారు.

తెలంగాణ పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్...

● జగిత్యాల డివిజన్, మెట్‌పల్లి డివిజన్ ఎన్నికలు

కోరుట్ల: జగిత్యాల డివిజన్, మెట్‌పల్లి డివిజన్ తెలంగాణ పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం జరిగినట్లు ప్రకటించారు. జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా దురిశెట్టి మనోహర్, జిల్లా ముఖ్య సలహదారుగా జవహార్‌లాల్ నాయక్, జిల్లా అదనపు కార్యదర్శిగా వరుణ్ కుమార్, జిల్లా కోశాధికారిగా శ్రీనివాస్, జిల్లా ఆఫీసు కార్యదర్శి రంజీత్‌కుమార్, జగిత్యాల డివిజన్ అశోక్, కోశాధికారిగా యండీ రహీమ్, మెట్‌పల్లి ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్, కోశాధికారిగా శ్రీదర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిం చారు. ఎన్నికలకు ముఖ్య అతిథులుగా సుబ్రహ్మణ్యేశ్వర్, కంపెనీ ప్రధాన కార్యదర్శి, ఎన్నికల అధికారులుగా ప్రకాశ్, మధుసూధన్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, మెట్‌పల్లి ఏడీఈలు అనిల్‌కుమార్, ఏఈ సదాశి వరెడ్డితో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధ్యమే..

● కోరుట్ల సీఐ రాజశేఖర్ రాజు

కోరుట్ల: సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధ్యమేనని కోరుట్ల సీఐ రాజశేఖర్ రాజు అన్నారు. కోరుట్ల పట్టణంలో డిసెంట్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన అంధుల సంగీత విభావరి ఆద్యాంతం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి కోరుట్ల సీఐ రాజశేఖర్ రాజు, మున్సిపల్ చైర్మన్ శీలం వేణుగోపాల్‌లు హాజరై మాట్లాడారు. అంధ కళాకారుల ప్రతిభ అభినందనీయమని పేర్కొన్నారు. వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా ప్రజలకు వినోదాన్ని పంచే విధంగా వినూత్న తరహాలో కార్యక్రమాలను నిర్వహించడానికి ముందుకు రావడం హర్షనీయమని పేర్కొన్నారు. కాగా అంధుల సంగీత విభావరిలో భాగంగా అంధ కళాకారులు ఆలపించిన పలు పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాయకులు రుద్ర శ్రీనివాస్, డాక్టర్ దిలీప్‌రావు, చెన్న విశ్వనాథం, చింతకింది రాంప్రసాద్, యూత్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్, బోగ కార్తిక్, మారుపాక మహేశ్, నేరేళ్ల మల్లేశ్, పుప్పాల శేఖర్, దేశవేని విజయ్, దేశవేని రాజు, చిలివేరి ప్రశాంత్, ఆకుల వంశీ, దుంపేట విజయ్, జిందం లక్ష్మీనారాయణ, మాడవేని నరేశ్, నరేశ్, వాసాల గణేశ్, ఎండీ అతిక్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.


పాట పాడుతున్న అంధ కళాకారుడు


మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్ రాజు

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

● బ్రహ్మకుమారి సుమత

కోరుట్ల: విద్యార్థులకు మానసిక వ్యక్తిత్వ వికాసాన్ని మరింత పెంపొందించుకోవాలని కోరుట్ల ఈశ్వరీయ విశ్వ విద్యాలయ బ్రహ్మకుమారీలు సుమత, రాజేశ్వరిలు పేర్కొన్నారు. సోమవారం కోరుట్ల పట్టణంలోని కటుకం సంగయ్య ఫంక్షన్ హాల్‌లో జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులకు మానసిక వికాసంపై ఈశ్వరీయ బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించా రు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, పట్టణానికి చెందిన పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మకుమారి

'బతుకమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు'

కోరుట్ల: కోరుట్ల పట్టణం, మండలంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణం, మండలంలో మొత్తం 35,748 చీరలను పంపిణీ చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. పట్టణంలో 20,441, కోరుట్ల మండలంలో 15,307 చీరలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు తట్టు, రూబెల్లా టీకాల పంపిణీ

కోరుట్ల: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, కేరళ హైస్కూ ల్‌లలో సోమవారం విద్యార్థులకు తట్టు, రూబెల్లా టీకాలను పంపిణీ చేశారు. లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో డివైన్ చార్టిబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు టీకాలను వేశారు. ప్రాణాంత వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ కరస్పాండెంట్ తుమ్మ నపల్లి సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ సిరికొండ గంగాదర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం


మిఠాయిలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రభాకర్

కోరుట్ల: టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జీ సాంబారి ప్రభాకర్ పేర్కొన్నారు. నంద్యాలలో అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఘన విజయం సాధించడం పట్ల సోమవారం కోరుట్ల పట్టణంలో సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జాతీయ రహదారిపై టపాసులు పేల్చి పలువురికి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జీ సాంబారి ప్రభాకర్ మాట్లాడుతూ టీడీపీని ప్రజలు ఆదరిస్తున్నారని, రాబోయే 2019 ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీ అధికారంలోకి రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి రాజన్న, నాయకులు బాలె శంకర్, మానుక ప్రవీణ్, తోట లింగారెడి తదితరులు పాల్గొన్నారు.

'జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలి'

కోరుట్ల: జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాలని జగిత్యాల, కోరుట్ల అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఐబీ అతిథి గృహంలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడానికి ఏకగ్రీవ తీర్మాణం చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాంతానికి చెందిన పేద విద్యార్థులకు వైద్య విద్యతో పాటు పేద రోగులకు ఉచిత వైద్య సేవలను అందించడానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో అఖిల పక్ష నాయకులు అయిల్నేని సాగర్‌రావు, గిరి నాగభూషణం, బాజోజి భాస్కర్, బండి శంకర్, రఫియోద్దీన్, గడ్డం మధు, చెన్న విశ్వనాథం, జిల్లా ధనుంజయ్, పేట భాస్కర్, ఏఆర్ అక్బర్, ఇందూరి తిరుమల వాసు, చెట్‌పల్లి లక్ష్మణ్, సుతారి రాములు, సద్గురు, పాతర్ల విజయ్, సత్యం, బాలె శంకర్, రమణ, మ్యాక లక్ష్మణ్, గంగరాజం, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

'మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు సహకరించాలి'

మెట్‌పల్లి టౌన్: జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడానికి స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరుతూ మెట్‌పల్లిలో టీఆర్ఎస్‌యేతర అఖిలపక్ష నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. గతంలో ఇక్కడ ఉన్న ఉన్న ఇంజనీరింగ్ కళాశాలను హైదరాబాద్‌కు తరలించారని, తిరిగి ఈ ప్రాంతానికి ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు అయిల్నేని సాగర్‌రావు, టీవీ సత్యం, బాజోజి భాస్కర్, సాంబారి ప్రభాకర్, బెజ్జారపు శ్రీనివాస్, అబ్దుల్ హఫీజ్, చెట్‌పల్లి లక్ష్మణ్, కొమిరెడ్డి లింగారెడ్డి, తోకల సత్యనారాయణ, రాజరత్నాకర్, శంకర్ గౌడ్, సంపంగి రాజయ్య, గంప శ్రీనివాస్, దయ్య రాజారాం, పల్లె లింగం, యామ రాజయ్య, గొల్లపల్లి రామాగౌడ్, కోటగిరి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

కోనాపూర్‌లో భూపత్రాల పరిశీలన

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ గ్రామంలో రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణలో భాగంగా గ్రామ రెవెన్యూ అధికారి సత్యనారాయణ ఇంటింటికీ తిరిగి భూపత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోడేటి శేఖర్‌గౌడ్, ఉపసర్పంచ్ అనంతుల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణితో సమస్యల పరిష్కారం

- డీఆర్డీఏ పీడీ అరుణ శ్రీ
- జగిత్యాలలో ప్రజావాణికి 121 దరఖాస్తులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఆర్డీఏ పీడీ

విన్నపాల వేళ...

జగిత్యాల టౌన్: ప్రజావాణితోనే సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రతీ సోమవారం నిర్వహించనున్న ప్రజావాణిని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ అరుణశ్రీ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాలులో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి హాజరైన ప్రజలు వివిధ సమస్యలపై 74 దరఖాస్తులు సమర్పించారు. డబుల్ బెడ్ రూం పథకం కోసం 47మంది దరఖాస్తులు అందజేశారు. అనంతరం పీడీ అరుణశ్రీ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మహేశ్వర్, అర్బన్ తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పించండి...



-గంప సురేష్, వికలాంగుడు, ధరూర్

రోడ్డు ప్రమాదంలో కుడి కాలు తొలగించారు. భార్యాపిల్లలను పోషించుకోవడం ఇబ్బందిగా మారింది. డిగ్రీ పూర్తి చేశాను. కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పించి నా కుటుంబాన్ని ఆదుకోవాలి. అధికారులకు పలుమార్లు విన్నవించాను. కలెక్టర్ స్పందించాలి.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి



-వెల్మ రాణి, రామన్నపేట

ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్, నిజామాబాద్‌వంటి నగరాలకు వెళ్లి చికత్స చేయించుకోవాల్సిన పరిస్థితి. అధికారులు వెంటనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

8వ రోజుకు మెడికల్ కళాశాల సాధన దీక్ష


సంఘీభావం తెలుపుతున్న సభ్యులు

జగిత్యాల టౌన్: జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రముఖ వైద్యుడు సిరికొండ రవిశంకర్ ఆధ్వర్యంలో చేపట్టిన సాధన దీక్ష సోమవారం 8వ రోజుకు చేరుకుంది. దీక్షకు సారంగాపూర్ మండలంలోని లచ్చక్కపేటకు చెందిన ఫ్రీడం ఫైటర్స్ యూత్, జగిత్యాల మండలం టీఆర్‌నగర్‌కు చెందిన సామాజిక సేవా సంఘం సభ్యులు, జగిత్యాలకు చెందిన తెలంగాణ న్యాయ విద్యార్థుల సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.అనంతరం ర్యాలీగా వెళ్లి ప్రజావాణిలో డీఆర్‌డీఏ పీడీ అరుణశ్రీకి వినతి పత్రం అందజేశారు. బొల్లె శేఖర్, రంజిత్, గణేష్, ఆంజనేయులు, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్‌గా రాజేష్


నియామకపు పత్రం అందుకుంటున్న రాజేష్

జగిత్యాల టౌన్: తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం జగిత్యాల నియోజకవర్గ కన్వీనర్‌గా బీరం రాజేష్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కొండ యుగేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జాగృతి కార్యక్రమాలను విస్తృతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన నీలగిరి రాజేందర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను విస్మరిస్తున్న తెలంగాణ ప్రభుత్వం


చెరువుకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బీర్‌పూర్: తెలంగాణ ప్రభుత్వం రైతులను విస్మరిస్తోందని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని పెద్దలొద్దివాగు(సాతవొర్రె) కట్టకు బుంగ ఏర్పడి నీరు వృథాగా పోతోందని గ్రామరైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం ఒర్రెకట్టను పరిశీలించారు. ఎమ్మెల్యే కోటకింద ఉన్న నిధులతో మరమ్మతు చేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం భూగర్భజలాల పెంపు ఎంతైనా అవసరమని, చెక్‌డ్యాంలు, కాంటూరి కందకాలు నిర్మించాలని, నీటిని పొదుపు చేయాలని సూచించారు. విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు పసుపు, మిర్చి పంటలకు 1500బోనస్ ప్రకటిస్తే తెలంగాణ ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోందని విమర్శించారు. రైతు సంఘాల ఏర్పాటుతో టీఆర్‌ఎస్ నాయకుల చుట్టూ రైతులు తిరగాల్సిన పరిస్థితి నెలకొనే అవకాశం ఉందన్నారు. సంఘాల ఏర్పాటుతో టీఆర్‌ఎస్ నాయకులకే లాభాలు జరుగుతాయి కాని రైతులకు ఏమాత్రం ప్రయోజనం ఉండదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ నుంచి విడిపోయే సమయంలో లోటు బడ్జెట్‌లో ఉన్నా రైతులకు బోనస్ ప్రకటిస్తే బడ్జెట్ నిధులతో ఉన్న తెలంగాణ ప్రభుత్వం కనీసం రైతులను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వాటర్‌ఫిల్టర్‌ను పరిశీలించారు. పాఠశాల వసతులను గురించి ప్రిన్సిపాల్ రమేష్‌శర్మను అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ కోండ్ర రాంచందర్ రెడ్డి, బీర్‌పూర్ ఎంపీటీసీ మసర్తి రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుడిసె జితేందర్ యాదవ్, నాయకులు అక్కినపెల్లి సంపత్, బదినపెల్లి శంకర్, నాయకులు పాల్గొన్నారు.

సినిమా గ్రేడ్



జగిత్యాల

బాలాజీ - ఫిదా
దుర్గరాజ కళా మందిర్ - వీఐపీ-2
నటరాజ్ - జయ జానకి నాయక
శ్రీ శ్రీనివాస - అర్జున్ రెడ్డి
శ్రీరామ- నేనే రాజు.. నేనే మంత్రి

రాయికల్

రాజశ్రీ - పటేల్ సర్..
మహేశ్వరి - శమంతకమణి

సామూహిక సెలవుకు తపస్ మద్దతు


సమావేశమైన ఉపాధ్యాయులు

జగిత్యాల అర్బన్: సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్‌తో సెప్టెంబరు ఒకటో తేదీన నిర్వహించే సామూహిక సెలవుకు తపస్ జగిత్యాల మండల శాఖ మద్దతు తెలపింది. సోమవారం మండల ఉద్యోగ, ఉపాధ్యాయులను కలిసి సామూహిక సెలువుకు సహకరించాలని కోరింది. ఈ సందర్భంగా తపస్ నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.తపస్ మండల శాఖ అధ్యక్షులు ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు అశోక్‌రావు, మల్లికార్జున్, తిరుమల్‌రెడ్డి, సత్యనారాయణ, రజినికాంత్, మురళి, భీమయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు శ్రీచైతన్య విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

జగిత్యాల అర్బన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ అండర్-14 విభాగంలో ఆడేందుకు ఎంపికయ్యారు. శ్రీచైతన్య పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మహీన్ బేగం, 7వ తరగతి చదువుతున్న ఎస్.శశాంక్ జిల్లా స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాడెంట్ కె.గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమ, వైస్ ప్రిన్సిపాల్ చారి, పీఈటీలు అభినందించారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న యూత్ సభ్యులు

రాయికల్: వినాయక నవరాత్రోత్సవాలను యువకులు భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపేటలో యంగ్‌బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గోపి మాదవిరాజిరెడ్డి, సర్పంచ్ మీనుగు అంజయ్య, ఎంపీటీసీ గంగారెడ్డి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక సెలవు పత్రం అందజేత


సెలవు పత్రం అందజేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

జగిత్యాల రూరల్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని, 1980 పెన్షన్ రూల్స్ (పాత పెన్షన్ విధానం) ప్రకారం సీపీఎస్ ఉద్యోగులందరికీ వర్తింపజేయాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. సోమవారం జగిత్యాల ఎంపీడీవో శ్రీలతరెడ్డికి ఎంపీడీవో కార్యాలయంలో సామూహిక సెలవు పత్రం అందజేశారు. సెప్టెంబర్ 1న సెలవు మంజూరు చేయాలని కోరారు. మహేశ్వర్‌రెడ్డి, కుమారస్వామి, స్వప్న, శిరీషా, నవీన్, విజయ్ కుమార్, విజయలక్ష్మి, శ్రీవాణి, వినయ్‌కుమార్, స్వరూపలు పాల్గొన్నారు.

ప్రతి గ్రామం అంకాపూర్‌గా ఎదగాలి

● రూ. 6500 కోట్లతో పంట రుణాలకు నిధి ఏర్పాటు ● రైతు అవగాహన సదస్సులో మంత్రి ఈటల రాజేందర్



మంత్రి ఈటల, ఎంపీ సుమన్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న టీఆర్ఎస్ నాయకులు

ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి: రైతులు అనాథలు కాదని, సంఘాలుగా ఏర్పడి శాసించే స్థాయికి చేరాలని, ప్రతి గ్రామం అంకాపూర్‌గా ఎదగాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన రైతు అవగాహన సదస్సుకు హాజరై ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రైతు సంక్షేమంకోసం పాటుపడుతున్నదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని ఆయన తెలిపారు. గడిచిన రబీ సీజన్‌లో రాష్ట్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 8 వేల కోట్ల రూపాయల విలువలైన 40 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఏ ఒక్క రైతుకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో డబ్బులు చెల్లించామన్నారు. రైతులు ఒక సంఘంగా ఏర్పడి తాము పండించిన పంటను గిట్టుబాటు ధరలకు పంట ఉత్పత్తులను అమ్ముకుని ఆర్థిక పరిపుష్టిని సాధించేందుకు సీఎం కేసీఆర్ రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేయాలని సంకల్పించాలన్నారు. 15 మందితో గ్రామ సంఘం, 24 మందితో మండల, జిల్లా సంఘం, 42 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పాటవుతుందన్నారు. గిట్టుబాటు ధరలు పొందేందుకు 500 కోట్లతో నిధి ఏర్పాటు చేశామని, రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు 6,500 కోట్ల నిధులను రాష్ట్ర కమిటీ ప్రభుత్వం కార్పస్ ఫండ్‌గా ఇవ్వనుందన్నారు. టీఆర్ఎస్ పార్టీ రైతుల కోసం ఏమీ చేయడం లేదంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు చిల్లరగా మాట్లాడుతున్నారని, మాది అలాంటి గుణం కాదన్నారు. 2018 జూన్ నాటికి పాత కరీంనగర్ జిల్లా వాటర్ హబ్‌గా, సీడ్, రైస్‌బౌల్ ఆఫ్ తెలంగాణగా మారబోతున్నాయని అన్నారు. రెండు పంటలకు నీళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు.

మిషన్ కాకతీయ ద్వారా చెరువులకు కళ

పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగలా చేస్తున్నాడని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన విధ్వంసాన్ని పొగొట్టేందుకు సీఎం కేసీఆర్ పరితపిస్తున్నారన్నారు. రైతుల కోసం మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగు చేశామని, సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, 24 గంటల కరెంట్ ఇస్తున్నామని, 1700 కోట్ల రుణ మాఫీ చేస్తే కాంగ్రెస్ నేతలు ఏడుస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి తామేదో చేసినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. ఎస్సారెస్పీని ప్రత్యేక శ్రద్ధతో కట్టలేదని మాజీ ప్రధాని దేశంలో పలు ప్రాజెక్టులు కట్టే క్రమంలో ఇక్కడ నిర్మించారే తప్ప ప్రత్యేకంగా కట్టలేదన్నారు. ఎస్సారెస్పీ ఎగువ భాగాన మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ వంటి ప్రాజెక్టులను కడితే చూస్తూ ఊరుకున్నారన్నారు. జూన్ 1 నుంచి ఆగస్టు 15 వరకు కురిసిన వర్షాల వల్ల గోదావరి గుండా 200 టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయని, ఎస్సారెస్పీలోకి 25 టీఎంసీల నీళ్లు కూడా రాలేదన్నారు. ఎస్సారెస్పీకి నీళ్లు వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఈ క్రమంలో దానికి జీవం పోసేందుకు సీఎం కేసీఆర్‌లా ఎప్పుడైనా ఆలోచించారా అని కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడితే మాజీ మంత్రి శ్రీధర్‌బాబు ఒక గుండాగా ప్రవర్తించారని ఆయన అన్నారు. రామగుండంను ఇండస్ట్రీస్ సిటీగా తీర్చిదిద్దుతామని, త్వరలోనే 6500 కోట్లతో ఒక పరిశ్రమను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. రైతులకు పెట్టుబడులకు ఎకరానికి నాలుగు వేల రూపాయలు ఇవ్వడం చారిత్రాత్మకమని రైతులంతా సంఘటితంగా ముందుకు సాగాలన్నారు.

రైతు సమన్వయ సమితుల ఏర్పాటుతో రైతుల బతుకులు బాగు..

అంతకు ముందు ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రైతు సమన్వయ సమితిల ఏర్పాటుతో రైతుల బతుకులు బాగు పడతాయన్నారు. గ్రామాల్లో రైతు వికాస కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి ఎకరానికి పంట పెట్టుబడుల కింద 4 వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో, ఎస్సారెస్పీ పునరుజ్జీవనం జరిగి ఈ ప్రాంతానికి రెండు పంటలకు నీళ్లు వస్తాయన్నారు. పెద్దపల్లి అభివృద్ధి కోసం మరిన్ని నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్సీ భానుప్రసాదరావు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో రైతులకు ఎకరానికి 4 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టెక్నికల్ సర్వీసెస్ చైర్మన్ డాక్టర్ రాకేష్ కుమార్, ఐసీడీఎస్ సమన్వయకర్త మూల విజయారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, జడ్పీటీసీ లంక సదయ్య, టీఆర్ఎస్ పార్టీ నాయకులు పల్లె రాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని విద్యార్థి దుర్మరణం

● పెద్దపల్లి జిల్లా కొత్తపల్లి వద్ద రోడ్డు ప్రమాదం
● న్యాయం చేయాలంటూ గ్రామస్థుల ధర్నా



కుమార్ మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

పాలకుర్తి: పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామ బస్టాండ్ వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రోడ్డు ప్రమాదంలో విద్యార్థి అక్కడిక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. సోమవారం ఉదయం 8.30గంటలకు జరిగిన ఈ సంఘటనతో వెంటనే పెద్దఎత్తున గ్రామస్థులు చేరుకున్నారు. దాదాపు ఎనిమిది గంటల పాటు శవంతో ఆందోళనకు దిగారు. దీంతో రాకపోకలకు పూర్తి అంతరాయం కలిగింది. ధర్మారం ఎక్స్ రోడ్డు నుంచి కుక్కలగూడూరుకు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఈ ప్రమాదం జరుగడం, బాధితులు ఆందోళనకు దిగడంతో వాహనాలన్నీ బసంత్‌నగర్ మీదుగా తరలించారు. సంఘటన వివరాలు...

కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇతవేని కుమార్ (16) పెద్దపల్లి సింధూరు కళాశాలలో ఐటీఐ చదువుతున్నాడు. కుమార్ తండ్రి ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లాడు. రోజువారిగా కుమార్ సోమవారం ఉదయం కూడా ఐటీఐకి వెళ్లేందుకు కొత్తపల్లి గ్రామం నుంచి కాలినడకన ప్రధాన రోడ్డు వరకు చేరుకుని బస్టాండ్‌లో నిల్చున్నాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన గోలాడ లింగయ్య బైక్(టీఎస్ 02 ఈజే 3079)పై పెద్దపల్లికి వెళుతుండడంతో తాను కూడా వస్తానని కుమార్ లిఫ్ట్ అడిగాడు. ఇద్దరు కలిసి బైక్‌పై కొద్ది దూరం వెళ్లగానే మారేడుపల్లికి చెందిన నవయుగ లారీ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీటిప్పర్(ఏపీ26 ఏ 1172) ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. కుమార్ తలపై నుంచి, లింగయ్య చేతిపై నుంచి లారీ వెళ్లడంతో కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. లింగయ్య తీవ్రగా యాలపాయ్యాడు. ఈ విషయం గ్రామస్థులకు, కుటుంబ సభ్యులకు తెలియగానే పెద్దఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మొదట గుర్తు తెలియని వాహనంగా పోలీసులు భావించారు. అయితే పోలీసులు ప్రమాదంపై వాహనాల తనిఖీ చేయడంతో నవయుగ లారీ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీగా గుర్తించారు. సంఘటనపై ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఉదయం నుంచి 8గంటల నుంచి వర్షంలో తడుస్తూ సాయంత్రం 5 వరకు ఆందోళన చేపట్టారు. ధర్మారం ఎస్ఐ బాబురావు, పెద్దపల్లి ఎస్ఐ జగదీశ్‌లు బాధిత కుటుంబ సభ్యులను సముదాయించినా వినకుండా ఆందోళన కొనసాగించారు. చివరికి మృతదేహాన్ని పోస్టుమార్టం చేసేందుకు మార్చురీకి తరలించి నవయుగ లారీ ట్రాన్స్‌పోర్టు వారిని పిలిపించి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చేసిన ఆందోళనకు ప్రజా ప్రతినిధులు, నాయకులు మద్దతు ప్రకటించారు. కుమార్ కుటుంబానికి, గాయపడిన లింగయ్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈసాలతక్కళ్లపల్లి సర్పంచ్ ముక్కెర శ్రీనివాస్, జయ్యారం సర్పంచ్ గంగాధరి రమేష్, కన్నాల సర్పంచ్ సూర సునీతసమ్మయ్య, బీజేపీ నాయకుడు కౌశిక హరి, అయోధ్యసింగ్, కమాన్‌పూర్ జడ్పీటీసీ సంపత్ తదితరులు మద్దతు తెలిపారు. కుమార్ మృతదేహాన్ని పెద్దపల్లి మార్చురీలో భద్రపరిచారు. మంగళవారం కుటుంబ సభ్యులు ఇచ్చే ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుంటామని బసంత్‌నగర్ పోలీసులు తెలిపారు. కుమారుడు మృతి చెందిన సమాచారం మేరకు దుబాయ్ నుంచి బయలుదేరాడు. మృతుడి తండ్రి వచ్చేంత వరకు మృతదేహాన్ని మార్చురీలో ఉంచనున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆరు వారాల్లో తేల్చండి

చెన్నమనేని పౌరసత్వంపై కేంద్ర హోంశాఖకు సుప్రీంకోర్టు ఆదేశం

వేములవాడ : వేములవాడ శాసనసభ్యుడు చెన్నమనేని రమేశ్ పౌరసత్వ వివాదంపై ఆరు వారాల్లో తుది నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు కేంద్ర హోం శాఖను ఆదేశించింది. తప్పుడు ధృవీకరణ పత్రాలతో చెన్నమనేని రమేశ్ భారతదేశ పౌరసత్వం పొందాడని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ 2009 జూన్‌లో కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేయడంతో ప్రారంభమైన ఈ కేసు ఎనిమిదేళ్ల కాలంలో వివిధ మలుపులు తిరిగింది. ఏళ్లుగా నానుతూ వస్తున్న ఈ కేసుపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం 2016 ఆగస్టు 11న విచారణ జరిపి చెన్నమనేని రమేశ్ పౌరసత్వంపై మూడు నెలల్లోగా తమ నిర్ణయాన్ని హైదరాబాద్‌లోని ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. అయితే తమకు మరింత గడువు కావాలని కేంద్ర హోంశాఖ కోరడంతో సుప్రీం కోర్టు అంగీకరించింది. అయితే ఈ గడువు కూడా పూర్తయినా కేంద్ర హోంశాఖ నుంచి స్పందన లేకపోవడంతో ఆది శ్రీనివాస్ మరోసారి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ధ్విసభ్య దర్మాసనం సోమవారం విచారణ జరిపి వచ్చే ఆరు వారాలలో చెన్నమనేని పౌరసత్వ వివాదంపై తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. దీంతో కదలిక లేకుండా ఉండిపోయిన ఈ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చినట్లయింది.

వరకట్నం వేధింపుల్లో కేసు నమోదు

ఎల్లారెడ్డి పేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన పెద్దమైసన్నగారి షార్వాణి తనను భర్త అశోక్ అదనంగా కట్నం తీసుకరమ్మంటూ వేధింపులకు గురిచేస్తున్నాడని పిర్యాదు రాగా భర్త అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. షార్వాణికి 14 ఏళ్ల క్రితం వివాహమైంది. అశోక్ గొల్లపల్లికి ఇల్లరికం వచ్చాడు. కొంత కాలంగా తన భర్త తనను అదనంగా రూ. 10 లక్షలు కట్నం తీసుకరమ్మని వేధించడంతో పాటు పీకలదాకా మద్యం తాగి చంపుతానని కత్తితో బెదిరించినట్లు బాధితురాలు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ఎల్లారెడ్డి పేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గుండారపు గాలవ్వ (60) అనే వృద్ధురాలు అనారోగ్యం భరించలేక సోమవారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గాలవ్వ నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. అంతే కాకుండా తన భర్త వెంకట్‌రెడ్డి సైతం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు వేణు పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్తీ ఆహార పదార్థాలపై టాస్క్‌పోర్స్ దాడులు

● తయారీ చేసిన పదార్థాల సీజ్
● పోలీసుల అదుపులో నిర్వాహకుడు

సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల పట్టణంలో కల్తీ ఆహార పదార్థాలు, మసాలల తయారీ కేంద్రాలపై టాస్క్‌పోర్స్ పోలీసులు దాడులు కొనసాగిస్తున్నారు. సోమవారం పట్టణంలోని తారకరామానగర్ ప్రాంతంలోని కల్తీ ఆహార పదార్థాల తయారీ కేంద్రంలపై టాస్క్‌పోర్స్ ఇన్‌చార్జ్ ఉపేందర్, టౌన్ ఎస్సై శేఖర్‌ల ఆధ్వర్యంలో దాడులు చేశారు. గణేష్‌నగర్‌కు చెందిన వడ్డెపల్లి రాజేశం అనే వ్యక్త కొద్ది రోజులుగా తారకరామానగర్‌లో గది అద్దెకు తీసుకుని అల్లం, వెల్లుల్లి పెస్టులతో పాటు గరం మసాల, కొబ్బరిపోడిలను తయారీ చేస్తూ పట్టణంలోని దుకాణాల్లో విక్రయిస్తుంటాడు. ఇటీవల శాంతినగర్‌లోని మసాల తయారీ కేంద్రంపై టాస్క్‌పోర్స్ పోలీసులు దాడులు చేసి కల్తీ మసాలలను తయారీ చేసి ఓర్జీనల్ కవర్లలో ప్యాక్ చేసి విక్రయిస్తుండగా గుర్తించి సీజ్ చేసిన విషయం తెలిసిందే. సోమవారం తారకరామానగర్‌లో మరో ఆహార పదార్థాల తయారీ కేంద్రాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా తయారు చేస్తూ విక్రయిస్తున్నాడని సమాచారం అందుకున్న టాస్క్‌పోర్స్, పోలీసులు ఆ కేంద్రాన్ని గుర్తించి దాడులు చేశారు. తయారీ కేంద్రంలో 3క్వింటాళ్ల అల్లం, వెల్లుల్లి పెస్టుతో పాటు ధన్యాలు, కోబ్బరిపోడి నిల్వలను స్వాధీనం చేసుకోని నిర్వాహకుడు రాజేశంను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి సోమవారం రాత్రి తహసీల్దార్ రాజు ఎదుట బైండోవర్ చేశారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ నిందితుడి అరెస్టు

గణేశ్‌నగర్: విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలానికి చెందిన శనిగరం రమేశ్‌ను ట్రాన్స్‌కో సీఐ బి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐలు పీవీచారి, బి పర్శరాములు, పీసీ రవి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. 25న శనిగరం రమేశ్ తన ఇంటికి మీటర్ లేకుండా విద్యుత్‌ను నేరుగా తీగలకు వైర్లు తగిలించి వాడుకుంటూ పట్టుబడడంతో మొదటి తప్పుగా భావించి కేసు నమోదు చేసి జరిమాన విధించినట్లు తెలిపారు.

ఈ నెల 26న మరల నిందితుడి ఇంటిని తనిఖీ చేయగా విద్యుత్‌ను వాడుకుంటూ పట్టుబడినట్లు ప్రకటనలో తెలిపారు. దీంతో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

నిధులు లేవు.. విధులూ లేవు...

● నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

కరీంనగర్ టౌన్: నిధులు... విధులు లేక జిల్లా పరిషత్ నానాటికి నిర్వీర్యమవుతున్నది. జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకోలేక, వారు ప్రాతినిధ్యం వహించిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టలేకపోతున్నారు. కనీసం కళ్ల ముందు కనిపించే సమస్యలను కూడా పరిష్కరించలేక ఉత్సవ విగ్రహాలుగా మారుతున్నామని ఆవేదన చెందుతున్నారు. నిబంధనల మేరకు జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు, సర్వసభ్య సమావేశాలను నిర్వహిస్తున్నప్పటికీ ఆయా సమావేశాల్లో చేసిన తీర్మానాలు అమలుకు నోచుకోవడం లేదు. అధికారులు మొక్కుబడిగా హాజరవుతుండడంతో సమావేశాలు నామమాత్రంగానే సాగుతున్నాయి. ప్రతి సమావేశంలో విద్య, వైద్యం, వ్యవసాయం, రైతాంగ సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సభ్యులు ఏకరవు పెడుతున్నా వాటికి పరిష్కారం లభించడం లేదు. మంగళవారం జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ అధ్యక్షతన జరిగే సమావేశంలో మళ్లీ ఇవే అంశాలపై చర్చ జరిగే అవకాశాలున్నవి.

● రద్దయిన బీఆర్‌జీఎఫ్..

స్థానిక సంస్థల్లో భాగమైన జిల్లా పరిషత్‌లకు ప్రభుత్వం ప్రత్యేకించి నిధులు కేటాయించక పోవడంతో అవి నిర్వీర్యం అవుతున్నాయి. గతంలో కేంద్రం నుంచి వచ్చే బీఆర్‌జీఎఫ్ నిధులు ప్రస్తుతం రావడం లేదు. ఆ పథకాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. 14వ ఆర్థిక సంఘం ద్వారా ఇచ్చే నిధులను మొత్తం నేరుగా గ్రామ పంచాయతీలకే విడుదల చేస్తుండడంతో జిల్లా, మండల పరిషత్‌లకు నిధులు రావడం లేదు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి ఏడాది నుంచి జిల్లా, మండల పరిషత్‌లకు నిధులు నిలిపి వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎస్ఎఫ్‌సీ గ్రాంటును మూడేళ్లుగా విడుదల చేయడం లేదు. ఈ గ్రాంటు ద్వారా కరీంనగర్ జిల్లా పరిషత్‌కు ఏటా 4 కోట్ల నిధులు రావాల్సి ఉండగా, గత ప్రభుత్వ హయాంలో విడుదల చేయాల్సిన పెండింగు నిధులను మాత్రమే విడుదల చేశారు. అవి 30 లక్షల వరకు వచ్చాయి. బీఆర్‌జీఎఫ్, 14వ ఆర్థిక సంఘం ద్వారా జడ్పీకి కనీసం 38 నుంచి 42 కోట్ల వరకు నిధులు వచ్చేవి. అవి రాకుండా పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ నిక్షేపాలు ఎక్కువగా ఉన్నాయి.

గుట్టలను గ్రానైట్ కోసం లీజుకు ఇవ్వడం వల్ల రాయల్టీ, లీజుల రూపేణా గడిచిన పన్నెండేళ్లలో ప్రభుత్వానికి జమ అయిన నిధుల్లో జడ్పీకి 120 కోట్ల రూపాయల వరకు రావాల్సి ఉండగా, 15 కోట్లు మాత్రమే వచ్చాయి. టీఎస్ఎండీసీ నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌ల ద్వారా వస్తున్న ఆదాయంలో జడ్పీకి 20 శాతం నిధులు రావాల్సి ఉండగా, జిల్లాల విభజనకు ముందు 80 లక్షల రూపాయల వరకు వచ్చాయి. ఆ తర్వాత నిధులు రాలేదు. సాధారణ నిధి కింద కూడా నిధులు సక్రమంగా రావడం లేదు. జిల్లాలు వేరైనా తర్వాత జడ్పీ వేరు కాకపోయినా, ఆయా జిల్లాల నుంచి జడ్పీలకు జమ కావాల్సిన నిధులు జమ కావడం లేదు. దీంతో జిల్లా పరిషత్‌ల నిర్వహణ కష్టంగా మారింది.

● సమావేశాలకే పరిమితం..

ఏడాది కాలంగా జిల్లా పరిషత్ నుంచి గ్రామాల్లో ఒక్క పని కూడా జరగలేదు. స్టాండింగ్ కమిటీ, సర్వసభ్య సమావేశాలకే పరిమితం కావాల్సి వస్తున్నది. ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మారారు. జడ్పీటీసీ సభ్యులు గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆయా శాఖల అధికారులు కూడా వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేకించి ఎలాంటి నిధులు విడుదల చేయకపోవడం, జిల్లాల విభజనతో మండలాలు చెల్లాచెదురు కావడంతో జడ్పీ నిర్వీర్యంగా మారింది.

హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: సెప్టెంబర్ 1 న ఉమ్మడి జిల్లా జూనియర్స్(అండర్-19) హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి నర్సయ్య, బి లక్ష్మణ్, పోటీల నిర్వాహకుడు ఐరీస్ పాఠశాల ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అల్గునూర్ ఐరీస్ వరల్డ్ పాఠశాలలో బాల, బాలికల విభాగాలలో ఈ పోటీలను నిర్వహించనున్నామన్నారు. విజేతలకు బహుమతులను అందించడంతోపాటు సెప్టెంబర్ 21, 22, 23 తేదీల్లో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీలకు 1-1-1998 తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని, ఆసక్తి, అర్హత గల వారు ఎస్ఎస్‌సీ ఒరిజినల్ మెమోతో ఉదయం 9 గంటలకు పీఈటీ నాయుడుకు రిపోర్టు చేయాలని తెలిపారు.

ఎంపీ బాల్కసుమన్ రాజీనామా చేయాలి

● మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

గోదావరిఖని: టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ గోదావరిఖనిలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయనందుకు పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ తన పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎంపీ, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి ప్రాంతంలో నిమ్స్‌ను తలపించేలా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, దీనిపై సుమన్ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. మెడికల్ కళాశాల ఏర్పాటుపై సమన్‌కు చిత్తశుద్ధి ఉంటే పోరాటం చేయాలని తాము పార్టీలకతీతంగా భాగస్వామ్యం అవుతామన్నారు. ఈ ప్రాంతంలో అత్యవసర కేసుల్లో హైదరాబాద్‌కు వెళ్లేలోపు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రామగుండంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చలకు సిద్ధమని పొన్నం సవాల్ విసిరారు. టీబీజీకేఎస్ వల్ల కార్మికులకు ఒరిగిందేమి లేదన్నారు. గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు టీబీజీకేఎస్‌ను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మూడేళ్లలో సింగరేణి స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్, దాని అనుబంధ సంఘాల నాయకులు బడికెల రాజలింగం, గుమ్మడి కుమారస్వామి, కాల్వ లింగస్వామి, మహంకాళి స్వామి, రవికుమార్, బొంతల రాజేష్, కొలిపాక సుజాత, పెద్దెల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

బీడు భూములు సాగులోకి...

● నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

ధర్మపురి: తెలంగాణలోని బీడు భూములను సాగులోకి తీసుక రావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు స్పష్టం చేశారు. మండలంలోని తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాల్లో 3,400 ఎకరాల బీడు భూములకు సాగునీరందించేందుకు రూ. 32 కోట్లతో నూతనంగా నిర్మించిన గోదావరి ఎత్తిపోతల పథకాలను సోమవారం మధ్యాహ్నం ఆయన ప్రారంభించారు. అనంతరం రాయపట్నం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరానికి నీరందించడానికి సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయలతో అనేక సాగు నీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు చేపట్టారని ఆయన తెలిపారు. కాళేశ్వరంలో లిఫ్టు చేసి ఎల్లంపల్లి ప్రాజెక్టును నిండు కుండలా మార్చబోతున్నట్లు ఆయన వివరించారు. టూరిజం, మత్స్య సంపద, ఎత్తిపోతల పథకం కింద ఆయకట్టు నదికి అటు ఇటు రైతులకు పెద్ద ఎత్తున నీరందించే అవకాశముందని ఆయన తెలిపారు. ఎస్ఆర్ఎస్‌పీ నింపడం కోసం వేయి కోట్లు ఖర్చు చేయడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. ఈ పనులు పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరంది రైతుల కష్టాలు తీరుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ హయాంలో మంథని, కాళేశ్వరం ప్రాజెక్టులకు అటవీ అనుమతి లభించలేదని, ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టుకు ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ కూడా రాలేదన్నారు. మిడ్ మానేరు ప్రాజెక్టుకు కేవలం 106 కోట్లు ఖర్చు చేసి వదిలిపెట్టారని, ఎల్లంపెల్లి ప్రాజెక్టుకు ఒక లిఫ్టు కూడ బిగించలేదని ఆయన విమర్శించారు. నియోజకవర్గ పరిధిలోని దమ్మన్నపేట, స్తంభంపల్లి, వెలగటూర్ గోదావరి ఎత్తిపోతల పథకాలు మంజూరు దశలో ఉన్నాయన్నారు. ధర్మపురి అక్కపెల్లి చెరువు, జగదేవ్‌పేట జంగల్‌నాల ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ మండలంలోని దొంతాపూర్, ఎడపల్లి, జైనా, రాజారం, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాల్లో 8,500 ఎకరాల బీడు భూములు సాగులోకి తీసుకరావడం కోసం 80 కోట్లు నిధులు మంజూరు చేయించి ఎత్తి పోతల పథకాలు పారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, ఐడీసీ రాష్ట్ర ఛైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, ఐడీసీ ఎండీ సురేష్‌కుమార్, జగిత్యాల ఆర్‌డీవో నరేందర్, ఐడీఎసీ ఎస్ఈ లక్ష్మారెడ్డి, ఈఈ భాషానాయక్, డీఈఈలు కుమారస్వామి, మహేష్‌చందర్‌రావు, ధర్మపురి, వెలగటూర్ జడ్పీటీసీలు బాదినేని రాజమణి-రాజేందర్, గంగుల పద్మ-అశోక్, ధర్మపురి, వెలగటూర్ ఎంపీపీలు కొండపెల్లి మమత, పునుగోటి శ్రీనివాస రావు, దేవస్థానం ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ అల్లం దేవమ్మ, వైస్ ఎంపీపీ అయ్యోరు రాజేష్‌కుమార్, ధర్మపురి, జైనా పీఏసీఎస్ ఛైర్మన్లు బాదినేని రాజేందర్, సౌళ్ల నరేష్, వైస్ ఎంపీపీ అయ్యోరు రాజేష్‌కుమార్, కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ ఆసిఫ్, వైస్ ఛైర్మన్ మ్యాన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సమావేశాలు, వేడుకల్లో ఆశాభంగం కలుగుతుంది. వృత్తి, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు ఆటంకాలు ఎదరయ్యే అవకాశం ఉంది. ఉన్నత విద్య కోసం చేసే ప్రయత్నాలు ఫలించకపోవచ్చు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ప్రియతముల ఆరోగ్యం కలవరపెడుతుంది. ఖర్చులు అంచనాలు మించుతాయి. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. ఆర్థిక లావాదేవీల్లో గత అనుభవం ఉపయోగపడుతుంది.

మిథునరాశి: (మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఆవేదన కలిగిస్తుంది. వేడుకలకు ఏర్పాట్లలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. బంధుమిత్రుల కారణంగా మనస్తాపానికి గురవుతారు. అనుబంధాలు విస్తరిస్తాయి.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఇంటర్వ్యూలలో నిరాశ ఎదురవుతుంది. వైద్యం, పరిశ్రమలు, హోటల్, రిటైల్ రంగాల వారికి ఒక సమాచారం కలవరం కలిగిస్తుంది. సన్నిహితుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. విందుల్లో ఖర్చులు అధికం.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ప్రియతముల కోసం ఖర్చులు అంచనాలు మించుతాయి. పెట్టుబడుల్లో ఆచితూచి వ్యవహరించాలి. విద్యార్థులకు అవసరమైన నిధులు అందడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బదిలీలు, మార్పులు అసౌకర్యం కలిగిస్తాయి. రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగా వారు కీలక నిర్ణయాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యుల వైఖరి గురించి ఆలోచిస్తారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. స్టేషనరీ, రవాణా, బోధన, రచనా రంగాల వారికి ఆటంకాలు ఎదురవుతాయి. వాగ్వివాదాలకు దూరంగా ఉండాలి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక సంస్థలతో పనులు పూర్తి కావడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ఖర్చులు అంచనాలు మించే అవకాశం ఉంది. బృందకార్యక్రమాలకు అవసరమైన నిధులు సర్దుబాటు కావడంలో ఆలస్యం జరుగుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి తగిన సమయం కాదు. వృత్తి, వ్యాపారాల్లో ప్రయోగాలను వాయిదా వేయండి. పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ఊహించని అవాంతరాలు ఎదురవుతాయి. ప్రయాణాలు, చర్చలు ఫలించకపోవచ్చు. దూరంలో ఉన్న వ్యక్తులకు సంబంధించిన సమాచారం కలవరపెడుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సమావేశాలు, వేడుకలు, బృందకార్యక్రమాల కోసం ఖర్చులు అధికం. ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. పూర్వ మిత్రులను గుర్తు చేసుకుంటారు. విలువైన వస్తువుల కొనుగోలు సమయంలో జాగ్రత్త అవసరం.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఉన్నత పదవుల విషయంలో నిరాశకు గురవుతాయి. పెద్దలు, పైఅధికారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. సమావేశాల్లో ఈ గౌరవ, మర్యాదలకు భంగం కలిగే పరిణామాలు చోటుచేసుకుంటాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

కేజీబీవీ ఉద్యోగుల నిరసన

జగిత్యాల టౌన్ : పదో పీఆర్‌సీ అమలు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జగిత్యాల కలెక్టరేట్ ఎదుట సోమవారం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు హాజరై సంఘీభావం తెలిపి మాట్లాడారు. కేజీబీవీ ఉద్యోగులకు చెల్లించే వేతనాలు సరిపోవడం లేదని, వెంటనే 10వ పీఆర్‌సీ అమలు చేసి వేతనాలు పెంచాలని కోరారు. ఆరు నెలల ప్రసూతి సెలవులు మంజూరు చేసి హెల్త్‌కార్డులు జారీ చేయాలని కోరారు. వేసవి సెలవుల వేతనాన్ని చెల్లించి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ధర్నాలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోట రాజేష్, నాయకులు ఆగమయ్య, భూమేశ్వర్, శ్యాంసుందర్, అనిల్, ఇంతియాజ్, మహేష్ గౌడ్, జాఫర్, శ్రీనివాస్, కేజీబీవీ నాయకులు గీత, శ్రీలత, స్రవంతి, మంజుల, శైలజ పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

ధర్మపురి: ధర్మపురి మండలంలోని దొంతాపూర్‌లో గొల్లపల్లి శ్రీధర్ (17) అనే విద్యార్థి సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. శ్రీధర్‌ను ఇటీవల కరీంనగర్‌లో ఒక కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేర్చడం వల్ల చదువు పట్ల ఇష్టం లేక ఇంటికి వచ్చాడు. అనంతరం తల్లి గంగవ్వ మగ్గిడి మాడల్ స్కూల్‌లో చేర్పించింది. చదువు కోవడం ఇష్టం లేని శ్రీధర్ మనస్తాపంతో ఇంటిలో చీరతో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చే సరికి శ్రీధర్ ఉరివేసుకుని కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టుతో 25లక్షల ఎకరాలకు సాగునీరు

● భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు ● పెగడపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం ● పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల


కేడీసీసీబీ భవనం ప్రారంభిస్తున్న మంత్రి హరీష్‌రావు


మార్కెట్ గోదాం ప్రారంభిస్తున్న హరీష్‌రావు

పెగడపల్లి : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం వచ్చే జూలైలోగా పూర్తిచేసి 25లక్షల ఎకరాలకు సాగు నీరందించనున్నట్లు భారీనీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ తల్లి, కేడీసీసీబీ, సింగిల్‌విండో భవనాలు, మార్కెట్ గోదాంలను చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్‌తో కలిసి హరీష్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబిడ్డగా, రైతు కష్టాలు తీర్చేందుకే రేయింబవళ్లు పనిచేస్తూ అధికారంలోకి వచ్చిన రెండేళ్లకే కరెంట్ కష్టాలు లేకుండా చేసి, మూడో యేటి నుంచే అటు పరిశ్రమలు, ఇటు వ్యవసాయం, గృహావసరాలకు 24గంటల కరెంట్ ఇస్తున్నారన్నారు. మేడిపల్లి నుంచి యేటా సముద్రంలోకి వృధాగా వెళ్లే 250 టీఎంసీల నీటికి అడ్డంగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి కేవలం వేయికోట్ల ఖర్చుతో వరదకాలువ ద్వారా ఎస్సారెస్పీ నీటిని పంపింగ్ చేసి 25లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగు నీరందించనున్నట్లు తెలిపారు. వచ్చే జూన్, జూలై నుంచి బోరు ఎండుడు, బావి దంగుడు అనేది ఉండదని కాలంతో సంబంధం లేకుండా రెండు పంటలకు నీరు అందించి బీడు భూములన్నీ పచ్చని పంటలతో కళకళలాడుతాయన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, వరదకాలువ, కాకతీయ కాలువల మధ్యన గల లక్ష ఎకరాల భూములకు సాగునీరు అందుతుందన్నారు. కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇంటింటికి తాగునీటి పథకాలతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు.

కాళేశ్వరం పూర్తయితే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవు..

టీఆర్‌ఎస్ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అడ్రస్ గల్లంతవుతుందని, అందుకే పనులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి హరీష్‌రావు అన్నారు. మిడ్‌మానేరు నిర్మాణ పనులు తాము చేపట్టామని చెప్పుకునే కాంగ్రెసోల్లు 2005 నుంచి 2014 దాకా అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లలో కేవలం 106 ఓట్లు ఖర్చు చేస్తే, 3ఏళ్ల తమ ప్రభుత్వం 407కోట్లు వెచ్చించి నిర్మాణ పనులు పూర్తి చేసి లక్ష ఎకరాలకు నీరివ్వబోతున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టు పనులు పూర్తి చేసి 21టీఎంసీల నీరు నిలిపిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కాళేశ్వరం పూర్తయ్యే నాటికి కాకతీయ కాలువ మరమ్మతు పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టుకు నీరందించేందుకు రూ.806కోట్లతో కాల్వల మరమ్మతు పనులు చేపట్టబోతున్నామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 60ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభివృద్ధి పనులను స్వాగతించాల్సిపోయి విమర్శిస్తూ అబద్ధాల ప్రకటనలతో ప్రజలను మోసం చేస్తే చూస్తూ ఊరుకోరని అన్నారు. చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ప్రజల అవసరాల తెలుసుకుని పనిచేసేది టీఆర్‌ఎస్ ప్రభుత్వమన్నారు. అనతికాలంలోనే చిన్న చిన్న ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు భూరికార్డుల ప్రక్షాళనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి ఎంపీ సుమన్ మాట్లాడుతూ కాంగ్రెసోల్లు ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదు పనులకే వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్‌చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, విండోచైర్మన్ ఓరుగంటి రమణారావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తుల ఉమ, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు కటారి చంద్రశేఖర్‌రావు, రవీందర్‌రెడ్డి, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, ఎంపీపీ కాశెట్టి సత్తయ్య, జడ్పీటీసీ గజ్జెల వసంతస్వామి, వైస్ ఎంపీపీ కరుణాకర్‌రావు, మార్కెట్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, సర్పంచ్ తాటిపాముల రాజు, కేడీసీసీబీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, వెల్గటూర్ ఎంపీపీ శ్రీనివాస్‌రావు, మండల ప్రజాప్రతినిధులు, టీఆర్‌ఎస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు రూ. కోటి మంజూరు..

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులకు రూ. కోటి మంజూరు చేస్తున్నట్లు హరీష్‌రావు తెలిపారు. లింగాపూర్ చెరువును ఎస్సారెస్పీ నీటితో నింపేందుకు ప్రత్యేక కాలువ నిర్మాణానికి మంత్రి హామీ ఇచ్చారు. మండలానికో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు.

కేసీఆర్ కిట్‌తో మంచి గుర్తింపు..

కేసీఆర్ కిట్‌తో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మంచి గుర్తింపు వచ్చిందని ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు పని చేస్తున్నాయని పేర్కొన్నారు.

లక్ష్యం చేరలేదు..

● పక్కదారి పడుతున్న కస్టమ్స్ మిల్లింగ్ బియ్యం
● 75,545 మెట్రిక్ టన్నుల టార్గెట్

ఆంధ్రజ్యోతి, జగిత్యాల : కస్టమ్స్ మిల్లింగ్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కొందరు రైస్‌మిల్లుల యజమానులు సీఎంఆర్ పేరితో తీసుకున్న వరిధాన్యం నూర్పిడి చేసి ప్రభుత్వానికి అందించకుండా పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జగిత్యాల జిల్లాలో యాసంగిలో రికార్డు స్థాయిలో వరిధాన్యం ఉత్పత్తి కాగా, ప్రభుత్వం సీఎంఆర్ కింద వరిధాన్యం రైస్‌మిల్లర్లకు అప్పగించింది. గడువు ముగుస్తున్నప్పటికీ 63 శాతం మేరకు బియ్యం మాత్రమే ప్రభుత్వానికి అప్పగించారు. ఇంకా 37 శాతం ఇవ్వాల్సి ఉంది. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పోస్టు చాలా కాలంగా ఖాళీగా ఉంటుండగా, మెట్‌పల్లి సబ్ కలెక్టర్, ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ అయిన ముషారఫ్ ఫారూఖీ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పని ఒత్తిడి వల్ల ఆ శాఖపై పర్యవేక్షణ కొరవడటంతోనే జిల్లాలో చాలా మంది రైస్‌మిల్లర్లు సీఎంఆర్ బియ్యం ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో 73,545 టన్నుల టార్గెట్

జిల్లాలో 2016-17 సంవత్సరానికి 73,545 టన్నుల బియ్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కింద సేకరించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్ణయించింది. 2017 రబీలో జిల్లాలో 3 లక్షల 90 వేల టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసింది. జిల్లాలో 18 రైస్‌మిల్లులు ఉండగా, 1,08,155.045 టన్నుల వరిధాన్యం కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కింద అప్పగించారు. సీఎంఆర్ కింద ప్రభుత్వానికి 73,545.431 టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ఆగస్టు 26 వరకు 46,089 టన్నుల బియ్యం మాత్రమే రైస్ మిల్లర్లు అప్పగించారు. ఇంకా 27,456.431 టన్నుల బియ్యం ఇవ్వాలి. 100 శాతం ఆగస్టు నెలాఖరుకల్లా సీఎంఆర్ కింద ఇచ్చిన బియ్యాన్ని అప్పగించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు 63 శాతం మేరకే రైస్‌మిల్లర్లు అప్పగించారు. సెప్టెంబర్ 30 వరకు గడువు పెంచారని, కొందరైతే మాకు ఆర్డర్‌లు కూడా వచ్చాయని పేర్కొంటున్నారు. జగిత్యాల జిల్లాలో వరిధాన్యం ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పటికీ 18 రైస్‌మిల్లులే ఉండటంతో 1,08,155.045 టన్నుల వరిధాన్యాన్ని రైస్ మిల్లర్లకు అప్పగించారు. మిగిలిన వరిధాన్యాన్ని జిల్లాలో రైస్‌మిల్లులు లేకపోవడంతో పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలోని రైస్ మిల్లర్లకు అప్పగించారు. జిల్లాలో శ్రీసాయి ఇండస్ట్రియల్ వారు అతి తక్కువగా 34 శాతం మేరకే బియ్యం అందించగా, కృష్ణ ఇండస్ట్రీస్ 51 శాతం మేరకు వెంకటరమణ ఇండస్ట్రీస్ 52 శాతం, విష్ణు ఇండస్ట్రీస్ 53 శాతం, శ్రీ లక్ష్మీనృసింహ ఇండస్ట్రీస్ 57 శాతం, వెంకటసాయి ఇండస్ట్రీస్ 59 శాతం బియ్యం ఇప్పటివరకు సీఎంఆర్ కింద అప్పగించారు. అత్యధికంగా సురభి ఇండస్ట్రీస్ 78 శాతం అప్పగించారు.


రైస్‌మిల్లులో బియ్యం

కొరవడిన పర్యవేక్షణ

జిల్లాలో సివిల్ సప్లై అధికారి లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. జాయింట్ కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు ఉన్నప్పటికీ పని ఒత్తిడి పెరగడంతో పాటు మెట్‌పల్లి సబ్ కలెక్టర్‌గా వ్యవహరిస్తుండటం వల్ల పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లేదు. దీంతో కొందరు రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సీఎంఆర్ కింద బియ్యం అప్పగించకుండా పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిజానికి క్వింటాల్ వరి ధాన్యం తీసుకుంటున్న రైస్‌మిల్లర్లు నూర్పిడి చేసి 68 కిలోల బియ్యం ప్రభుత్వానికి సీఎంఆర్ కింద అప్పగించాలి. ఇందుకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.50 చెల్లిస్తుంది. దీనికి తోడు నూకలు, తవుడు, ఊకను కూడా రైస్ మిల్లర్లకే వదిలేస్తారు. గతంలో సీఎంఆర్ లేనప్పుడు రైస్ మిల్లర్లు పోటీలు పడి ధాన్యం తెప్పించుకుని నూర్పిడి చేసి ఇవ్వగా, ఇప్పుడు ప్రభుత్వమే సీఎంఆర్ కింద వరిధాన్యం అప్పగించినప్పటికీ పూర్తిస్థాయిలో అందించడం లేదు. బియ్యం ధర రోజురోజుకు పెరుగుతుండటంతో పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గురుకుల పాఠశాలల్లో భోజనాలపై నిఘా


భోజనం వడ్డిస్తున్న సిబ్బంది


జగిత్యాలలోని మైనార్టీ గురుకుల పాఠశాల

ఆంధ్రజ్యోతి, జగిత్యాల : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పెడుతున్న భోజనాలపై నిఘా పెట్టనున్నారు. జగిత్యాల జిల్లాలో ఎస్సీ, బీసీ, మైనార్టీలకు చెందిన 18 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. అయితే కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సకాలంలో భోజనం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా విద్యార్థులకు భోజనం అందకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం మైనార్టీ గురుకుల పాఠశాల వెల్ఫేర్ అధికారిగా వ్యవహరిస్తున్న జగిత్యాల ఆర్డీవో నరేందర్ దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన తీవ్రంగా పరిగణించి జరిగిన ఘటనపై విచారణ చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో సూపరింటెండెంట్ మహమూద్ అలీ అఫ్సర్ వెళ్లి విచారణ జరిపారు. భోజనం వడ్డింపుపై జరిగిన ఆలస్యంపై ఆరా తీశారు. పూర్తి స్థాయి నివేదికను జగిత్యాల ఆర్డీవో, ఇన్‌ఛార్జి డీఎండబ్ల్యూవో నరేందర్‌కు అందజేశారు. అధికారుల తప్పిదం వల్లే విద్యార్థులకు సకాలంలో భోజనం అందడం లేదని గ్రహించిన ఆర్డీవో నరేందర్ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ శరత్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సూచనల మేరకు వార్డెన్ అబ్దుల్ అహద్‌కు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరుగకుండా ఉండేందుకు అన్ని గురుకుల పాఠశాలల్లో మెస్ కమిటీలు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థులతో కమిటీ వేయడంతో పాటు ప్రతి రోజు ఒక బుక్‌లో ఏ భోజనం ఎంత ఇస్తున్నారు, ఏ సమయంలో ఇస్తున్నారో తదితర వివరాలను నమోదు చేసి విద్యార్థులు రోజువారీగా సంతకాలు పెట్టాలని నిర్ణయించారు. హాస్టల్ బోర్డుపై డీఎండబ్ల్యూవో నెంబర్‌తో పాటు సూపరింటెండెంట్ నెంబర్‌ను కూడా డిస్‌ప్లే చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలల్లో ఈ విధానం ప్రవేశపెడుతున్నట్లు జగిత్యాల ఆర్డీవో డాక్టర్ ఘంటా నరేందర్ తెలిపారు. దీని వల్ల పారదర్శకత పెరుగడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందన్నారు.



ఎదురుగట్ల వెంకటేశ్వరస్వామి భూమిలో నాటిన పండ్ల మొక్కలు

హరితహారంలో ఆదర్శం..

ఎకరం భూమిలో 1,750 పండ్ల మొక్కల పెంపకం

ఉపాధి హామీలో సామాజిక ప్లాంటేషన్ ఏర్పాటు

వేసవిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ఎదురుగట్ల గ్రామస్థులు

వేములవాడ టౌన్: హరితహారం కార్యక్రమాన్ని ఆ గ్రామ ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకున్నారు. గతంలో నాటిన మొక్కలు చాలావరకు కనిపించకుండా పోయాయి. సర్పంచ్ సోయినేని లహరి, ఎంపీపీ రంగు వెంకటేశ్ ఆధ్వర్యంలో గ్రామంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలోని ఎకరం భూమిలో 1,750 పండ్ల మొక్కలను నాటారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. వాటి బాధ్యతను గ్రామ ప్రజలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. దీంతో ఆ మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షిస్తూ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.. వేమలవాడ మండలం ఎదురుగట్ల వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలోని ఆరు ఎకరాల భూమిలో గత సంవత్సరం హరితహారం కార్యక్రమంలో భాగంగా గుంతలు తవ్వారు. కలెక్టర్ నీతూ ప్రసాద్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమ కలిసి మొక్కలు నాటి ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, అంగన్‌వాడి కార్యకర్తలు పెద్ద ఎత్తున పండ్ల మొక్కలను నాటారు. వేసవి కాలంలో మొక్కలను నీరందించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేక శ్రద్ద తీసుకున్నారు. బోరు పైపుల, వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందించి మొక్కలను సంరక్షించారు. ప్రస్తుతం నాటిన ఒక్కమొక్క కూడా ఎండిపోకుండా ప్రతీ మొక్కను జాగ్రత్తగా చూసుకుంటున్నారు. గతంలో నాటిన ఉసిరి, అల్లనేరేడు మొక్కలు ప్రస్తుతం కాపునకు వచ్చాయి.



ఉపాధిహామీ నిధులతో సంరక్షణ..

కమ్యూనిటీ ప్లాంటేషన్ కింద వేంకటేశ్వరస్వామి వారి ఆలయ స్థలంలో మొక్కలు నాటారు. ఉపాధి హామీ, మండల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మొక్కల సంరక్షణ కింద రూ. 45 వేలు మంజూరు చేశారు. మొక్కల సంరక్షణకు నెలకు రూ.5 వేల చొప్పున పది నెలల పాటు చెల్లించారు. దీంతో గ్రామస్థులు ఉపాధిహామీ అధికారుల ప్రత్యేక సంరక్షణలో మొక్కలు పెరుగుదల సాధ్యమవుతోంది. మరో రెండు సంవత్సరాల్లో ఈ మొక్కలు కాతకు వస్తాయని అధికారులు తెలుపుతున్నారు.

గ్రామస్థుల సహకారంతోనే మొక్కల సంరక్షణ

సోయినేని లహరి, ఎదురుగట్ల, సర్పంచ్



మా గ్రామ ప్రజల, వార్డు మెంబర్‌లు, వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ, మెంబర్ల సహకారంతోనే 1,750 పండ్ల మొక్కలను కాపాడుతున్నాము. వేసవి కాలంలో వాటర్ ట్యాంకర్‌ల ద్వారా, బోరుబావుల ద్వారా నీటిని అందించాము. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరిగాయి. ప్రజల సహకారంతోనే మొక్కలను సంరక్షిస్తున్నాం. ఉపాధిహామీ ఏపీవో, ఎంపీడీవోల సహకారం కూడా అందింది. మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

● సందర్భం...

ఒకటే గమ్యం



● అరకొర వసతులతో అద్భుత ప్రతిభ చూపుతున్న క్రీడాకారులు ● నేడు జాతీయ క్రీడా దినోత్సవం



ధ్యాన్‌చంద్ (ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్: ఇంట్లో నాన్న తిడితే ఆందోళన.. కళాశాలలో అధ్యాపకులు మందలిస్తే ఆవేదన.. మార్కులు తక్కువస్తే నైరాశ్యం.. ఓడిపోతే వైరాగ్యం.. ఎందుకీ వైపరీత్యం.. ఉక్కులాంటి సంకల్పంతో ముందుకు సాగాల్సిన యువతలో ఎందుకీ నిస్తేజం. జీవితంలో గెలుపు ఓటములు సహజమని.. ఎంత నిబద్ధతతో వ్యవహరిస్తున్నామన్నదే ముఖ్యమని ఎందుకు మర్చిపోతుంది ఈ యువజనం.. చిన్ననాటి పుస్తకాలు, మార్కులు అనే గిరిలో కూరుకుపోతున్న నవతరం గెలుపొస్తే ఆకాశమే హద్దుగా.. ఓడిపోతే పాతాళమే దిక్కు గా వ్యవహరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.. క్రీడాస్ఫూర్తి లేకపోవడమే అందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.. పిల్లల్లో జీవితంపై సానుకూల దృక్పథం పెరగడానికి దోహదపడే క్రీడలపై అటు పాలకులకు.. ఇటు తల్లిదండ్రులకు ఉన్న చిన్న చూపు చిన్నారుల్లో, యువతలో అశాంతిని నింపుతోంది. క్రీడల్లో గెలుపు ఓటముల మధ్య తేడా తెలియదు.. ఆటలాడడం వల్ల కలిగే ప్రయోజనమిదే. ఈ నేపథ్యంలో వ్యక్తి జీవితంలో ఇంతటి ప్రాశస్త్యంగల క్రీడల ప్రాధాన్యాన్ని జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా పరిశీలిద్దాం...

● నేపథ్యం...

భారత దేశ హాకీ గొప్పదనాన్ని ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసిన మహా క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్. హాకీ అనే పదానికి మారుపేరుగా నిలిచిన మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు ఆగస్టు 29న మనం జాతీయ క్రీడా దినంగా నిర్వహించుకుంటున్నాం. మన జాతీయ క్రీడను ప్రపంచ నలుమూలలా వ్యాపింపజేసిన హాకీకి అంతర్జాతీయ ఖ్యాతి నార్జించి పెట్టిన ఆ మహామనిషి ప్రపంచ హాకీ చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచి పోయాడు. ఆయన గౌరవార్థం ఆయన జయంతి రోజు జాతీయ క్రీడా దినంగా ప్రకటించింది.



టీపీఎల్ కబడ్డీ పోటీల వ్యూ(ఫైల్)

మెగా ఈవెంట్లకు వేదికగా జిల్లా...

ఈ సంవత్సరం కరీంనగర్ జిల్లా మూడు మెగా ఈవెంట్లకు వేదికగా నిలిచింది. జిల్లా కేంద్రానికి సమీపంలోని కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో 62వ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలు, జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో తెలంగాణ ప్రీమియర్ లీగ్ కబడ్డీ పోటీలు, జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియం, ఎస్సారార్ కళాశాల మైదానాల్లో కరీంనగర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల నిర్వహణతో జిల్లా పేరు జాతీయ స్థాయిలో మారుమ్రోగింది.



అంతర్జాతీయ వేదికపై పతకం అందుకున్న మధుసూదన్(ఫైల్)



అంతర్జాతీయ వేదికపై పతకాలతో అంజన

● జిల్లా క్రీడారత్నాలు...

విభిన్న క్రీడల్లో రాణిస్తూ... జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాష్ట్ర కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేస్తున్నారు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు.

● మాస్టర్ అథ్లెటిక్స్‌లో కీర్తికిరీటం... మధుసూదన్

మాస్టర్ అథ్లెటిక్స్‌లో అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి బహుమతులను అందుకున్న జిల్లాకు చెందిన ఎలగందుల మధుసూదన్ మరింత పట్టుదలతో మలేషియాలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొని రజత పతకం సాధించారు. 2012లో మాస్టర్స్ అథ్లెటిక్స్ ప్రారంభించిన మధుసూదన్ అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలను సొంతం చేసుకున్నారు. మలే షియాలోని కౌలలాంపూర్‌లో ఆగస్టులో జరిగిన 31వ అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 65+ సం వత్సరాల విభాగంలో 5 కిలోమీటర్ల రేస్‌లో రజత పతకం సాధించి జిల్లాకు గర్వంగా నిలిచారు.

● ఆత్మవిశ్వాసమే ఆయుధంగా... అంజన

ఆత్మవిశ్వాసమే ఆయుధంగా జిల్లాకు చెందిన ఇరవెల్లి అంజన జాతీయ, అంతర్జాతీయ కరాటే పోటీల్లో జిల్లా, రాష్ట్ర క్రీడా పతాకాన్ని రెపరెపాలడిస్తోంది. ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన అంజన తన చిన్నతనంలోనే కరీంనగర్ కాంటినెంటల్ బుడోకాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో చేరి శిక్షణ తీసుకుంది. జపాన్, నేపాల్, ఇండోనేషియా, థాయిలాండ్, శ్రీలం, బ్యాంకాక్, మలేషియా, సింగపూర్, తదితర దేశాల్లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో అనేక పతకాలను సాధించింది.

● ఖో-ఖోలో ఎదురేలేని వీరుడు... ఆనంద్

జిల్లాకు చెందిన పండుగ ఆనంద్ ఖో-ఖో క్రీడలో ఎదురులేని వీరుడుగా తన ప్రతిభ చాటుతూ అంతర్జాతీయ వేదికపై భారత్‌కు బంగారు పతకం అందించాడు. ఇల్లంతకుంటకు చెందిన పండుగ ఆనంద్ అప్పటి పీడీ వై మహేందర్‌రావు వద్ద పాఠశాల స్థాయిలో శిక్షణ పొందాడు. అప్పటి నుంచి చేజింగ్‌లో, రన్నింగ్‌లో ఎదురులేని క్రీడాకారుడిగా ఎదిగాడు. లెక్కకు మించి రాష్ట్రస్థాయి, దాదాపు 45 జాతీయ స్థాయి ఖో-ఖో పోటీల్లో పాల్గొని అనేక బహుమతులు అందుకున్నాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో జరిగిన అంతర్జాతీయ ఖో-ఖో పోటీల్లో భారతజట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి భారత్‌కు బంగారు పతకం సాధించి పెట్టాడు.



ఆనంద్‌ను ప్రశంసాపత్రంతో అభినందిస్తున్న సీఎం కేసీఆర్ (ఫైల్)



అంబేద్కర్ స్టేడియం వ్యూ

వసతులు అంతంతే...



నిర్మాణంలో ఉన్న క్రీడా పాఠశాల భవనం

ఆసుపత్రులు కాదు... ఆరోగ్యం కోసం స్టేడియాలు నిర్మించండి... యువతకు ప్రేరణగా నిలిచిన స్వామి వివేకానంద చెప్పిన మాటలివి. నేడు స్టేడియాల నిర్మాణాలను ప్రారంభిస్తున్నారే తప్ప వాటిల్లోని సౌకర్యాలు, కోచ్‌ల నియామకం, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ వంటి వాటిని పాలకులు, అధికారులు విస్మరిస్తున్నారు. దీంతో అవి ఉన్నా లేని విధంగానే మిగులుతున్నాయి. జిల్లాలోని స్టేడియాలు, మైదానాల పరిస్థితి కూడా పాలకులు, అధికారుల అలసత్వానికి, నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

● చూపులకే అంబేద్కర్ స్టేడియం...

అతి పెద్దగా కనిపించే కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం చూపులకే ఉంది. ఆడుకునే సదుపాయాలు, మెళకువలు, ఆటలు నేర్పే కోచ్‌లు సరిపడా ఇక్కడ లేరు. ఎప్పుడో ఏర్పాటు చేసిన సదుపాయాలు చెప్పుకునేందుకే పనికి వస్తున్నాయి తప్ప ప్రయోజనం అంతగాలేదు. దీంతో ఇక్కడ ఆడుకునే ఆటగాళ్లకు బదులుగా వాకింగ్ చేసే నడివయస్కులే ఎక్కువ దర్శనమిస్తున్నారు. గ్రామీణ క్రీడలైన వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ కోచ్‌లు లేరు.

● ఇండోర్ స్టేడియం ఎందుకో...

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో 2 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియం నిరుపయోగంగా మారింది. స్టేడియంలో ఫ్లడ్ లైట్లను అమర్చి కొద్దిపాటి సౌకర్యాలను మెరుగుపర్చి ఉపయోగంలోకి తేవడంలో పాలకులు, అధికారులు దృష్టి సారించడం లేదు. ఆడపాదడపా కరాటే, కబడ్డీ లాంటి క్రీడా సంఘాలు సొంత ఖర్చుతో ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేసుకుంటూ క్రీడలను నిర్వహిస్తున్నాయి.

● అసౌకర్యాలతో క్రీడా పాఠశాల...

దేశం గర్వించదగ్గ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన క్రీడా పాఠశాలలో అసౌకర్యాలే రాజ్యమేలుతున్నాయి. శిక్షణ వరకు బాగానే ఉన్నా వసతి, పాఠశాల తరగతుల సదుపాయాలు అధ్వానంగా మారాయి. 5 కోట్ల రూపాయల వ్యయంతో ఉజ్వల పార్కు సమీపంలో ఈ పాఠశాల కోసం ప్రారంభించిన భవనాల నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి.

● క్రీడేతర కార్యక్రమాలకే ఆర్ట్స్ మైదానం...

జిల్లా కేంద్రంలో నడిబొడ్డున ఉన్న ఆర్ట్స్ కళాశాల మైదానం(పూలే మైదానం) క్రీడేతర కార్యక్రమాలకే పరిమితమవుతుంది. దీంతో నిత్యం క్రీడలతో, క్రీడాకారులతో సందడిగా ఉండాల్సిన ఈ మైదానం జిల్లా అధికారులకు ఆర్థిక లాభాన్ని అందించే అడ్డాగా మారింది. ఈ మైదానాన్ని క్రీడలకే పరిమితం చేయాలని పలుమార్లు క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకునే నాయకులు, అధికారులు కరువయ్యారు.



ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎగ్జిబిషన్



క్రీడలతో మానసిక ఉల్లాసం..ఆరోగ్యం..

కళ్యాణ్‌నగర్: క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు దేహదారుఢ్యానికి దోహదపడుతాయి... ఉత్సాహవంతులైన యువతీ యువకులను వివిధ క్రీడారంగాల్లో ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అంతేకాకుండా ఉపాధి మార్గాలకు దారి చూపుతోంది. జిల్లాలో ప్రభుత్వం, సింగరేణి క్రీడాకారులకు ప్రోత్సాహం కల్పిస్తోంది. భారత హాకీ క్రీడాకారుడైన ధ్యాన్‌చంద్ జయంతి రోజు ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుతున్నారు. ధ్యాన్‌చంద్ హాకీక్రీడలో ఎన్నో విజయాలు సాధించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆసక్తి

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ఆసక్తి పెరిగింది. గ్రామాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, షటిల్, అథ్లెటిక్స్, స్కేటింగ్, బాస్కెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్‌లో మెరుగ్గా రాణిస్తున్నారు. శిక్షకుల కొరతతో వారు పోటీల్లో వెనుకబడుతున్నారు.



గోదావరిఖనిలోని సింగరేణి స్టేడియం

జిల్లాలో క్రీడా మైదానాల కొరత

క్రీడలకు నిలయంగా ఉన్న జిల్లాలో క్రీడా మైదానాల కొరత ఉంది. మండలానికో మినీ స్టేడియం నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. సింగరేణి ఏరియా ప్రాంతంలో గోదావరిఖని, యైటింక్లయిన్‌కాలనీ, సెంటినరీకాలనీల్లో సింగరేణి యాజమాన్యం మైదానాలు ఏర్పాటు చేసి క్రీడాకారులకు శిక్షణనిస్తోంది. ఎన్‌టీపీసీ యాజమాన్యం తమ పరిధిలో క్రీడామైదానాలను ఏర్పాటు చేసుకొంది.


శిక్షణతో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు

కరాటే మొండయ్య, శిక్షకుడు, గోదావరిఖని



సింగరేణి జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో మూడు దశాబ్దాలకుపైగా క్రీడాకారులకు శిక్షణనిస్తున్నాను. కరాటేతో పాటు బాస్కెట్ బాల్, వాలీబాల్, స్కేటింగ్, క్యారమ్స్, చెస్‌లలో క్రీడాకారులను తయారు చేశా. సింగరేణి యాజమాన్యం సహకారంతో 2000 సంవత్సరం నుంచి పోలీస్, ఆర్మీ అభ్యర్థులకు శిక్షణనిచ్చా. ఇప్పటి వరకు 500మంది ఉద్యోగాలు పొందారు.

దారి కనుక్కోండి



మీకు తెలుసా?



ఇంగ్లాండ్‌కు 600 ఏళ్లపాటు 'ఫ్రెంచ్' అధికార భాషగా కొనసాగింది.

టంగ్ ట్విస్టర్స్

1. A big black bug bit a big black bear and made the big black bear bleed blood.
2. Larry Hurley, a burly squirrel hurler, hurled a furry squirrel through a curly grill.
3. The king would sing, about a ring that would go ding.
4. National Sheepshire Sheep Association

ఔనా!



కవలలకు కూడా వేలిముద్రలు ఒకేలా ఉండవు.

సూక్తి

ఏ పనిలోనైనా అత్యుత్తమ ప్రదర్శన చూపించు. అప్పుడు ఒక విజయం మరో విజయానికి పునాదిగా నిలుస్తుంది.

జంబ్లింగ్ వర్డ్స్

1. LBIL ▶ ....
2. DEIS ▶ ....
3. WLLA ▶ ....
4. DERI ▶ ....

జంతర్ మంతర్

1. బంనుఅధం ▶ ....
2. తరంనిరం ▶ ....
3. లపాపాడి ▶ ....
4. చపందార ▶ ....

చిట్టీల్స్

ఆకాశమే హద్దుగా..



నిండైన ఆత్మవిశ్వాసంతో.. ఏదైనా చేయగలను.. ఎప్పటికైనా సాధించగలను అని అడుగు ముందుకు వేస్తే... విధి వెక్కిరించినా.. సంకల్పంతో అనుకున్నది సాధిస్తే.. ఈ ప్రపంచమే నీకు సలామ్ చేస్తుంది. సమాజం కీర్తిస్తుంది. ప్రతి ఒక్కరూ నిన్ను చూసి స్ఫూర్తి పొందుతారు. పుట్టుకతోనే రెండు చేతులు లేకపోయినా ఏనాడూ అధైర్యపడలేదా చిన్నారి. వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఐదేళ్లకే సైకిల్ నేర్చుకుని ఔరా అనిపించుకుంది రూత్ ఎల్విన్ ప్రాంకే.



